www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్ బుధవారం, 04.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 104
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad

## యాదగిరిగుట్టకు
# ఎంఎంటీఎస్

**50 నిమిషాల్లో దర్శనం.. కేవలం రూ.15—20 టికెట్‌తో ప్రయాణం**

- ఘట్కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ
- కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లు ప్రారంభానికి రెడీ
- భవిష్యత్ తరాల కోసమే కేంద్ర బడ్జెట్ అభివృద్ధే లక్ష్యం

03

హైదరాబాద్–యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ మూడో దశకు త్వరలో ప్రధాని మోదీ భూమి పూజ



తెలంగాణకు వందే భారత్, అమృత్ భారత్ రైళ్లు
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన



## కడియం.. కమాన్..

- కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు.. నేడు విచారణ
- అనర్హత పిటిషన్‌పై వ్యక్తిగతంగా హాజరుకావాలన్న ఆదేశాలు
- జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం.. వేగం పెంచిన స్పీకర్ కార్యాలయం
- దానం నాగేందర్ అఫిడవిట్‌తో రాజకీయ ప్రకంపనలు

03

## బీఆర్ఎస్ అంటే..
# భూ రాక్షసుల సమితి

10 ఏళ్లలో కనబడ్డ జాగలన్నీ కబ్జా చేశారు



- కమీషన్లు దండుకుని కేంద్ర నిధులను కూడా డైవర్ట్ చేశారు
- ఎవరి పొట్ట కొట్టాలి..ఎట్లా పైసలు సంపాదించాలన్నదే బీఆర్ఎస్ నేతల ధ్యాస
- మళ్లీ బీఆర్ఎస్ ను గెలిపిస్తే మీ ఇండ్లను కూడా కబ్జా చేస్తారు జాగ్రత్త
- కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద పైసల్లేవు.. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కూడా ఇయ్యక గోస పెడుతున్నరు
- వాళ్లను గెలిపిస్తే.. నిధులు ఎక్కడి నుండి తెస్తారో సమాధానం చెప్పాలి
- 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ను నిలదీయండి
- కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే.. మోదీని ఒప్పించి పెద్ద ఎత్తున నిధులు తెస్తా
- కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

06



# టై'డై'ఫాయిడ్

టైఫాయిడ్ మరణాల్లో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

- కలుషితమైన ఆహారం.. లోపించిన పారిశుద్ధ్యమే కారణం
- 2023లో 202 మంది మృతి
- రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదికలో విస్తుగొల్పే నిజాలు

02

# ప్రైవసీని పట్టించుకోరా

మెటాపై సుప్రీం ఆగ్రహం



- వాట్సాప్ ప్రైవసీ పాలసీ..
- మెటా కంపెనీకి సుప్రీంకోర్టు వార్నింగ్
- చట్టాలను పాటించకపోతే.. దేశం నుంచి వెళ్లిపోండి
- 2021లో వాట్సప్‌లో గోప్యతా పిటిషన్‌పై విచారణ

09



## ఐటీ కారిడార్‌లో
# స్కైవాక్

**నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు సర్కార్ నిర్ణయం**

- ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు
- రాయదుర్గ్-టీ హబ్ మధ్య కొత్త స్కైవాక్ ప్రతిపాదనలు సిద్ధం
- మెట్రో, ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ జంక్షన్‌ను కలుపుతూ స్కైవాక్
- స్కైవాక్‌తో 30 శాతం ట్రాఫిక్ తగ్గించాలని అధికారుల ప్రణాళిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ లో రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో మరిన్ని స్కైవాక్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకునేలా మార్గం సుగమం చేస్తున్నది. ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ సైతం కీలక నిర్ణయం మిగతా 02లో..

## భూముల ధరలకు
# గ్రీన్ సిగ్నల్!

- మార్కెట్ విలువ సవరణ ఫైల్ సీఎం టేబుల్‌పై.. సీఎంకు నివేదిక.. త్వరలోనే నిర్ణయం
- హైదరాబాద్ లో ఆల్రెడీ రికార్డు ఆదాయం
- రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపుపై కీలక అధ్యయనం
- హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఇప్పటికే సవరణ ప్రతిపాదనలు సిద్ధం
- జీహెచ్ఎంసీ కొత్త జోన్లకు అనుగుణంగా భూముల విలువ పునఃపరిశీలన
- రాబడి ఎక్కువ ప్రాంతాల్లో కొత్త రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు అవకాశం
- రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో ప్రభుత్వ ఆదాయానికి బూస్ట్
- డిసెంబరులో రికార్డు స్థాయిలో రూ.1,391 కోట్ల స్టాంప్ డ్యూటీ ఆదాయం
- 2025-26లో ఇప్పటికే గత రికార్డులను దాటిన రిజిస్ట్రేషన్ల శాఖ
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఖరీదైన రిజిస్ట్రేషన్లతో ఆదాయం పెరుగుదల
- సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలతో పారదర్శకత, సౌకర్యాల విస్తరణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో భూముల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. భూముల మార్కెట్ విలువ సవరణపై అధ్యయనం చేసేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల సవరణ ప్రతిపాదనలు సిద్ధం కాగా.. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువను సవరించాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఫైల్ సీఎంకు చేరింది. గతఏడాది హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూముల విలువ మిగతా 02లో..

## కిడ్నాప్ వివాదంలో
# మోహన్ బాబు

**ఎంబీయూ యూనివర్సిటీ వద్ద ఎస్ఎఫ్ఐ నేతలపై దౌర్జన్యం**

- తిరుపతిలోని ఎంబీయూ యూనివర్సిటీ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుల కిడ్నాప్
- మోహన్ బాబు బౌన్సర్లే కిడ్నాపర్లు.. ఫామ్ హౌస్‌లో బందీలుగా ఉంచిన ఘటన
- సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఎస్ఎఫ్ఐ నేతలకు విముక్తి

03



# సెన్సస్ తర్వాత సీట్ల సునామీ!

## తెలంగాణలో అసెంబ్లీ 175? ఎంపీ 25?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో త్వరలో నియోజకవర్గాల సంఖ్య భారీగా పెరగనుంది. బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మరో ఆరు నెలల్లో జనగణన పూర్తయ్యాక పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనివల్ల రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం ఉన్న 119 నుండి కనీసం 153 కి, పార్లమెంట్ స్థానాలు 17 నుండి 23–25 వరకు పెరిగే అవకాశం ఉంది. పెరిగిన స్థానాల్లో మహిళలకు 33 శాతం

- డీలిమిటేషన్‌తో రాజకీయ ముఖచిత్రం మారే వేళ
- జనగణన పూర్తయితే వెంటనే డీలిమిటేషన్
- మహిళలకు 33% రిజర్వేషన్ అమలు
- ఎస్సీ—ఎస్టీ రిజర్వేషన్లకూ మార్పులు
- ఒక్క ఎంపీకి 8—9 అసెంబ్లీ సెగ్మెంట్లు
- దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా వ్యూహం
- జమిలి ఎన్నికల దిశగా అడుగులు
- బీజేపీకి రాజకీయ లాభాల లెక్కలు
- డాక్టర్ కె. లక్ష్మణ్ వ్యాఖ్యలతో రాజకీయ చర్చ హీట్

రిజర్వేషన్లు కూడా అమలు కానున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వ మిగతా 02లో..



## మోదీ భయపడ్డారు
# దేశాన్ని అమ్మేశారు

**ట్రేడ్ డీల్ పై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**

- అదానీపై అమెరికాలో కేసు.. ఎప్‌స్టెన్ ఫైల్స్‌తో మోదీపై ఒత్తిడి పెరిగిందా?
- రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడనివ్వలేదంటూ స్పీకర్ నిర్ణయంపై రాహుల్ అసంతృప్తి
- ఆర్మీ మాజీ చీఫ్ నరవనే ఆర్టికల్ చర్చకు ప్రయత్నం.. లోక్ సభలో గందరగోళం
- మైక్ కట్‌తో బయటకు వచ్చిన రాహుల్.. పార్లమెంట్ ఆవరణలో మీడియాపై విమర్శల వర్షం

09

## మోదీ చాణక్యం..
# దిగొచ్చిన ట్రంప్

**500 శాతం బెదిరింపుల నుంచి 18 శాతానికి తగ్గిన టారిఫ్‌లు**

- రష్యా ఆయిల్ ఒత్తిడికి తలవంచని భారత్
- టారిఫ్ షాక్‌ను తట్టుకుంటూ సాగిన వ్యూహాత్మక చర్చలు
- అమెరికాపై ఆధారాన్ని తగ్గించిన మోదీ ప్రభుత్వం
- యూరోపియన్ యూనియన్తో ఫ్రీ ట్రేడ్ డీల్.. ట్రంప్‌కు షాక్
- భారత మార్కెట్ అవసరం అమెరికాకు అర్థమైన వేళ
- టెక్నాలజీ రంగంలో భారత్ లేకుండా యూఎస్‌కు గమ్యం లేదు

09




## జగిత్యాలలో కాంగ్రెస్‌కి
# సెగ తప్పదు

- టికెట్లతో తలెత్తిన తుఫాను..
- జగిత్యాల కాంగ్రెస్‌లో వర్గాల యుద్ధం
- సంజయ్ వర్సెస్ జీవన్..
- మున్సిపల్ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు సెగ

09




## తెలంగాణలో
# జీరో రిక్రూట్‌మెంట్

నిరుద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం



- రెండేళ్లయినా అందని రెండు లక్షల ఉద్యోగాలు..
- ఉద్యోగాలు భర్తీపై సీఎం రేవంత్ ముఖం చాటేయడం నిస్సిగ్గు చర్య
- మాట తప్పిన సీఎం.. ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

10

## కేంద్ర బడ్జెట్ పై
# అసత్య ప్రచారం వద్దు

ప్రతిపక్షాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హితవు



- కేంద్ర బడ్జెట్ ఎన్నికల లబ్ధి కోసం కాదు.. దేశ అభివృద్ధి కోసమే
- యువత, గ్రామీణ ఉపాధి, పెట్టుబడులు, పరిశోధనలకు ప్రాధాన్యం
- తెలంగాణకు భారీ కేటాయింపులు.. రహదారులు, రైల్వే, హౌసింగ్‌లో దూకుడు
- హైదరాబాద్ 'హబ్స్ ఆఫ్ హబ్'గా అభివృద్ధి చెందుతోంది

02

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 04.02.2026
www.mudranews.in | @mudranews





## టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

యూరోప్ దేశాల మధ్య సరి హద్దుల్లేని వాణిజ్యం. సరుకులు, సేవలు, మూలధనం, మనుషుల స్వేచ్ఛాయుత ప్రవాహం దీనికి బలం.




# సెన్సస్ తర్వాత సీట్ల సునామీ!

**(మొదటి పేజీ తరువాయి)**

హించడం ద్వారా రాజకీయ సుస్థిరత సాధించాలని కేంద్రం భావిస్తోంది. జనాభా ప్రాతిపదికన జరిగే ఈ మార్పులతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.

**మారుతున్న ముఖచిత్రం**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం త్వరలో పూర్తిస్థాయిలో మారిపోనుంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తలపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియతో రాష్ట్రంలో అసెంబ్లీ , పార్లమెంట్ స్థానాల సంఖ్య భారీగా పెరగనుంది. ఈ పరిణామాలపై బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తాజాగా కీలక సమాచారాన్ని పంచుకున్నారు. దేశవ్యాప్త జనగణన (సెన్సస్) ప్రక్రియ రాబోయే ఆరు నెలల్లోనే పూర్తవుతుందని.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, వచ్చే ఎన్నికల నాటికే మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తెలంగాణలో ప్రజా ప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న జనాభా లెక్కలు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని నిబంధనలను బట్టి ఈ మార్పులు ఎలా ఉంటాయంటే.. ప్రస్తుతం తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పునర్విభజన చట్టం ప్రకారం వీటిని కనీసం 153కు పెంచాలని ప్రతిపాదించారు. అంటే 34 కొత్త స్థానాలు అదనంగా రానున్నాయి. అయితే జనాభా పెరుగుదల ప్రాతిపదికన ఈ సంఖ్య 161 నుండి 175 వరకు కూడా వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. 19 లక్షల జనాభాకు ఒక ఎంపీ స్థానం ఉండాలి. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 23 నుండి 25కు పెరిగే అవకాశం ఉందని అంచనా.

**పెరుగనున్న మహిళా ఎమ్మెల్యేలు**

గతంలో ప్రతి లోక్ సభ స్థానానికి 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండేవి. పెరిగిన జనాభా దృష్ట్యా ఒక్కో ఎంపీ స్థానం పరిధిలోకి 8 నుండి 9 అసెంబ్లీ స్థానాలను చేర్చే యోచనలో కేంద్రం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెరగడంతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 153కు చేరితే.. అందులో 51 స్థానాలు మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. దీనితో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల స్వభావం కూడా జనాభా లెక్కల ఆధారంగా మారుతుంది. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించడం వల్ల రాజకీయంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో.. ప్రస్తుతమున్న ప్రాతినిధ్య రేషియోను దెబ్బతీయకుండా సీట్లను పెంచే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం అసెంబ్లీకి ఒకసారి, పార్లమెంట్‌కు మరోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికల వల్ల తెగిపోయిన ఈ బంధాన్ని మళ్ళీ కలపాలని బీజేపీ భావిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి (జమిలి ఎన్నికలు) జరిగితే జాతీయ అంశాల ప్రభావం రాష్ట్ర ఎన్నికలపై కూడా ఉండి.. తమకు మేలు జరుగుతుందని బీజేపీ వ్యూహకర్తల అంచనా.

2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన 8 స్థానాలు ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని వివరించారు. కిచెన్ కేబినెట్లలో నిర్ణయాలు తీసుకునే కుటుంబ పార్టీల సంస్కృతి తమది కాదని.. 12 ఏళ్లు క్రియాశీలక సభ్యుడిగా ఉన్న ఏ సామాన్య కార్యకర్త అయినా జాతీయ స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. నితిన్ నబీన్ వంటి నేతలే ఇందుకు నిదర్శనమని ఆయన గుర్తు చేశారు.



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు.. ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్నపన మండపంలో ముఖ్యఅర్చకులు వెంకటనాగరాజ శర్మ, వేద పండితులు ప్రదీప్ కుమార్ శర్మ మహదాశీర్వచనం పలికి.. అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 5 మున్సిపాలిటీల్లో 341 మంది

**ముద్ర, వనపర్తి:**
వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలో పరిధిలో మొత్తం 80 వార్డులు ఉండగా నామినేషన్ల పరిశీలన ఉపసంహారణ తర్వాత 341మంది బరిలో నిలిచినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలోని వనపర్తి మున్సిపాలిటీలో 33వార్డులకు గాను 150మంది, పెబ్బేరు మున్సిపాలిటీలో 12వార్డులకు గాను 501మంది, కొత్తకోట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 56మంది, ఆత్మకూరు మున్సిపాలిటీలో 10 వార్డులగాను 41మంది, అమరచింత మున్సిపాలిటీలో 10 వార్డులకు గాను 43మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఆయా ఎన్నికల అధికారులు ప్రకటించారు.

### భూముల ధరలకు

# గ్రీన్ సిగ్నల్!

**(మొదటి పేజీ తరువాయి)**

సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా.. సవరణ చేపట్టాలనే ప్రతి పాదనలు వచ్చాయి. ఈ మేరకు భూములు మార్కెట్ పెంపుపై ప్రతి పాదనలు సైతం సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఆమోదం మాత్రం రాలేదు. ఈ క్రమంలో ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం మార్పులు చేపట్టింది.

**జోన్ల వారీగా..**

జీహెచ్ఎంసీ కోర్ అర్బన్ ప్రాంతాన్ని 12 జోన్లుగా విభజించింది. వాటిలో 60 సర్కిళ్లు, 300 డివిజన్లు ఏర్పాటు చేసింది. ఈ మార్పులను అనుసరించి ఆయా సర్కిళ్ల వారీగా భూముల వాస్తవిక విలువపై ఒక నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించింది. మరోవైపు రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి చాలాకాలంగా ఎలాంటి మార్పులు చేపట్టలేదు. ప్రస్తుతం కోర్ అర్బన్ మార్పుల కారణంగా వీటికి సంబంధించి కూడా సంస్కరణలు చేపట్టే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాబడి అధికంగా ఉండే ప్రాంతాలను కలుపుతూ కొత్తగా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

**పుంజుకున్న రియల్**

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారి పుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతో పాటు శివారు ప్రాంతాలు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలో నే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 1,391.30 కోట్ల ఆదాయం సమకూరింది. ఇప్పటి వరకు నమోదైన రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1,390 కోట్లు అధికం కాగా తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 2022–23లో రూ.11,806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు ఇప్పుడు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటి కి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 2022–23లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడు రాలేదు. అప్పట్లో భూముల ధరలు తక్కువగా ఉండటమే దీనికి కారణమని చెప్పవచ్చు. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతో పాటు హైదరాబాద్ శివారు, చుట్టు పక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయం పెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. నివాస గృహాలు, విల్లాలు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లతోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో ఇటీవల జరిగిన ఖరీదైన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కారణంగా రాబడి గతం కంటే పెరిగి ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

**సమీకృత కార్యాలయాలు**

ఇక రేవంత్ సర్కార్ రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకతను పెంచడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమీకృత సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మంత్రి పొంగులేటి పలు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు భూమి పూజ సైతం చేసారు. ఈ విధానంలో భాగంగా.. పలు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒకే చోట చేర్చి కార్పొరేట్ తరహాలో అత్యాధునిక భవన సముదాయాలను ఒకే చోట ఉండే విధంగా నిర్మిస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ ఇవి ఏర్పాటు కానున్నాయి. ఈ సమీకృత ఆఫీసుల్లోనే మ్యారేజ్ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణుల కోసం ఫీడింగ్ రూమ్స్, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక వెయిటింగ్ హాల్స్ వంటి ఆధునిక వసతులు కల్పిస్తున్నారు.





# ఐటీ కారిడార్‌లో స్కైవాక్

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకుంది. సైబరాబాద్‌లోని రాయదుర్గ్–టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో ఈ నెల 2న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ జంక్షన్ మీదుగా టీ–హబ్ వరకు నిర్మించనున్నారు. మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు. ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్–1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీ–హబ్, మైండ్ స్పేస్ సీ–గేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో రోజురోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ప్రజలకు ఈ సమస్య నుంచి ఉపశమనం కలగాలంటే స్కై వాక్ లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని.. దాన్ని అమలు చేస్తోంది.



# టై'డై'ఫాయిడ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో టైఫాయిడ్ విలయతాండవం చేస్తున్నది. జబ్బు నిర్ధారణ అయినా.. సకాలంలో చికిత్స అందని దైన్య తి నెలకొన్నది. ఇంకొన్ని ప్రాంతాల్లోనయితే.. వ్యాధిగ్రస్తులు టైఫాయిడ్ ను సాధారణ జ్వరం అని భావించి వైద్యంపై మక్కువ చూపడం లేదు. ఫలితంగా వారి పరిస్థితి విషమించి చికిత్స అందేలోపే ప్రాణాలు పోతున్నాయి. ప్రస్తుతం దేశంలో నమోదు అవుతున్న ప్రతి ఐదు టైఫాయిడ్ మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలతో వెల్లడైన ఈ నివేదిక కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు కేంద్ర నివేదిక వెల్లడించింది. దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ స్పష్టం చేసింది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడంతో పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి ఇటీవల రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదయ్యాయి. ఇందులో తెలంగాణ దేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తర ప్రదేశ్ 377 మరణాలతో మొదటి స్థానంలో ఉంది. మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. కాగా దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం కేంద్రాన్నీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఈ నివేదికను పరిశీలిస్తే రాష్ట్రంలో టైఫాయిడ్ విజృంభణ ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతున్నది.

**టైఫాయిడ్ వ్యాప్తికి కారణాలు**

సాల్మోనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మోనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మోనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది. అయితే టైఫాయిడ్ సోకిన చాలా మంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాలతోనే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో వైద్యం తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ తో పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడంతో మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్ పై అసత్య ప్రచారం వద్దు

## ప్రతిపక్షాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హితవు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉచితాల కోసం ప్రవేశపెడుతున్నారని విపక్ష పార్టీలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బడ్జెట్ ప్రవేశ పెడతారనే



ప్రజల ఆలోచనకు, భావనకు భిన్నంగా ఈ బడ్జెట్ రూపొందించామన్నారు. యువతకు, గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు, పరిశోధనలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు ఉందన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక పరిశోధకులు, మేధావులు, అవగాహన కలిగిన వారి మన్ననలు పొందిన బడ్జెట్ అని, రాష్ట్రాల వారీగా కాకుండా, దేశ అభివృద్ధిని కోసం బడ్జెట్ ఉన్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలకు సరిపడా నిధులను కేటాయించామని వాటికి ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు అందుతాయి. ఐటీ హబ్, ఎడ్యుకేషనల్ హబ్, డిజిటల్ హబ్, హైస్పీడ్ రైల్ కారిడార్ హబ్, సెమీ కండక్టర్ హబ్ , డేటా సెంటర్ హబ్, మెడికల్ హబ్, వంటివి వాటితో హబ్స్ ఆఫ్ హబ్ హైదరాబాద్ అవతరించిందని తెలిపారు. తెలంగాణలో ఉన్న 23 లక్షల ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి అన్నారు. వచ్చే ఐదేళ్ల కోసం రూ.10 వేల కోట్లతో ప్రకటించిన బయో ఫార్మా ద్వారా ఫార్మా కేపిటల్ గా ఉన్న మన హైదరాబాద్ నగరానికి చాలా మేలు జరగనుంది. వీబీ జీ రామ్‌ఉపాధి పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించామన్నారు. ప్రతి జిల్లాకు ఒక బాలికల వసతి గృహం నిర్మించనున్నట్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ కింద తెలంగాణకు 1.3 లక్షల ఇళ్లకు ఇంటికి రూ. లక్షన్నర చొప్పున రూ.2,190 కోట్లు కేటాయించనుంది. తెలంగాణలో దాదాపు 5 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేశామని ఇంకా నుంచి రూ.2,471.76 కోట్ల వ్యయంతో 64 కిలోమీటర్ల పొడవున ఆర్మూర్–జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. రూ.3,175 కోట్ల వ్యయంతో మహబూబ్‌నగర్–గూడెబళ్లూరు మధ్య 80 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ చేపట్టనున్నారు. 231 కిలోమీటర్ల మేర ఆరు లేన్లతో హైదరాబాద్–విజయవాడ మధ్య రూ.10,297 కోట్లతో రహదారి నిర్మించనున్నారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు (ఉత్తర భాగం)కు రూ.21,629 కోట్లను కేంద్రం కేటాయించింది. రాష్ట్రంలో 1242 కిలోమీటర్ల మేర రైల్వే లైన్లలో కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు మంజూరు కాగా, ఇప్పటి వరకు 627 కిలోమీటర్ల మేర పూర్తి అయింది. 410 కిలోమీటర్ల మేర పనులు త్వరలోనే పూర్తి కానున్నాయని అన్నారు.

కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సికింద్రాబాద్‌లో ఏర్పాటు అవుతోందని, దేశంలో 7 హైస్పీడ్ రైల్ ఎలివేటెడ్ కారిడార్స్ ప్రకటిస్తే అందులో మూడు మన హైదరాబాద్ నగరం నుంచే ప్రారంభం అవుతున్నాయన్నారు. ఎయిర్ పోర్టుల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, మేడారానికి రూ. 3 కోట్లకు పైగా నిధులను కేటాయించిందని వెల్లడించారు. గనుల కేటాయింపులో టెండర్లు వేసే ముందు సైట్ విజిట్ చేయాలనేది దేశ వ్యాప్తంగా ఉన్న రూల్ ప్రజలకు మేలు చేస్తుంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. 17 కంపెనీలు విజిట్ చేస్తే ఒక్కరికి కూడా సర్టిఫికెట్ ఇవ్వలేదని, నైనీ కోల్ బ్లాక్ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


**టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు**

NAFTA – USMCA (అమెరికా – కెనడా – మెక్సికో): ఉత్తర అమెరికాలో పరిశ్రమల సమీకరణకు మార్గం వేసిన ఒప్పందం. ఆటోమొబైల్, వ్యవసాయ రంగాల్లో భారీ మార్పులు తెచ్చింది.



# పదేళ్లు పట్టించుకోలేదు..

- **ఎన్నికలు రాగానే జనాల్లో తిరుగుతున్నారు**
- **సొంతింటి కలను నెరవేరుస్తాం**
- **ఖమ్మం సభలో మంత్రి పొంగులేటి**

**ముద్ర, ఖమ్మం :**

అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరు పై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారన్నారు, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని తానేనన్న మంత్రి..., ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలతో పేదల చెంతకు**

రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.





# గంజాయి హాట్‌స్పాట్స్ తనిఖీ

**ముద్ర, కొత్తగూడెం:**

భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సూచనలతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు నిర్వహించారు.కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించబడిన ప్రదేశాలలో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ తనిఖీలను నిర్వహించడం కోసం మత్తు పదార్థాలను కనిపెట్టే పోలీస్ జాగిలాలను ఉపయోగించడం జరిగిందని వివరించారు. ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లుగానీ, అక్రమ రవాణా చేస్తున్నట్లుగానీ, సేవిస్తున్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సీఐ కోరారు.

# హీటెక్కిన రాజకీయం

- **పార్టీ ఫిరాయింపుల కేసులో 'కడియం'కు స్పీకర్ నోటీసులు**
- **నేడు విచారణ.. ఇప్పటికే ఏడుగురికి క్లీన్ చిట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్ర రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. పార్టీ ఫిరాయింపుల కేసులో అనర్హత పిటిషన్ పై విచారణకు రావాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చారు.బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బుధవారం (ఫిబ్రవరి 4న) ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అనర్హత వేటుపై బీఆర్ఎస్ పట్టు**

ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించి. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. రేపటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

**దానం నాగేందర్ అఫిడవిట్..**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వాదించారు. గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని చెబుతూ, చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్..**

అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణ మోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు మాజరు కావాలని ఆదేశించారు.

# మోదీ సైలెంట్ వ్యూహం..

- **ఒక్క కలంపోటుతో బంగ్లాదేశ్ దివాళా**

**ముద్ర, ఢిల్లీ:**



బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆ దేశంలో భారత వ్యతిరేక శక్తులు ఒక్కటయ్యాయి. హిందూ దాడులు మొదలయ్యాయి. భారతీయ వస్తువులను తగలబెట్టాయి. ఇండియా ఔట్ నినాదాలతో రెచ్చగొట్టాయి. చైనా, పాకిస్తాన్‌తో దోస్తీ మొదలు పెట్టింది. అయితే భారత్ మౌనంగా ఉండటం వెనుక పెద్ద ప్రణాళిక దాగి ఉందని ఇప్పుడు స్పష్టమవుతోంది.

**టెక్స్‌టైల్స్ వ్యవస్థకు దెబ్బ..**

బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ వస్త్ర ఎగుమతులపై ఆధారపడి ఉంది. యురోపియన్ యూనియన్, అమెరికాకు ఎలాంటి సుంకాలు లేకుండా ఎగుమతులు చేస్తుంది. భారత వస్త్రాలు 10 శాతం పన్ను చెల్లించాలి. ఈ అసమానత బంగ్లాదేశ్‌కు ప్రయోజనం చేకూర్చింది. మోదీ యురోపియన్ యూనియన్‌తో 100 బిలియన్ డాలర్ల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసి, భారత వస్త్రాలకు కూడా పన్ను మినహాయింపు సాధించాడు. ఫలితంగా బంగ్లాదేశ్ అడ్వాంటేజ్ ముగిసింది.

**భారత్‌కు మళ్లిన ఆర్డర్లు**

తాజా ఒప్పందంతో యూరప్ ఆర్డర్లు భారత్‌కు మళ్లాయి. తమిళనాడు తిరుప్పూర్ వంటి ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు వేగం పెంచాయి, కొత్త ఉద్యోగాలు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్‌లో మూడు నెలల్లో వేలాది కంపెనీలు మూసివేశాయి, ఆర్థిక నష్టం పెరుగుతోంది.

**బంగ్లాదేశ్‌కు పవర్ కట్..**

జార్ఖండ్‌లోని అదానీ పవర్ నుంచి బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. హసీనా కాలంలో చెల్లింపులు సకాలంగా జరిగాయి, కానీ కొత్త ప్రభుత్వం ఉచిత విద్యుత్ డిమాండ్ చేస్తోంది. 850 మిలియన్ డాలర్లు బకాయి ఉంది. బిల్లు చెల్లించకుంటే సరఫరా నిలిపివేస్తామని అదానీ సంస్థ స్పష్టం చేసింది. సరఫరా సగానికి తగ్గించింది. దీంతో బంగ్లాదేశ్‌లో విద్యుత్ కోతలు మొదలయ్యాయి. ప్రజలు కరెంటు కోసం భారత్ కావాలని నినాదాలు చేస్తున్నారు.

**చైనా ఆకర్షణలో పడిన బంగ్లాదేశ్**

విద్యుత్ బకాయిలు చెల్లించేందుకు బంగ్లాదేశ్ చైనా దగ్గరకు వెళ్లింది. రుణం కావాలని అడిగింది. అయితే ఊరికే రుణాలు ఇవ్వడానికి చైనా ఒప్పుకోలేదు. బంగ్లాదేశ్ ఓడరేవులు, భూములు లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేసింది. మరోవైపు 2026లో ఎల్‌డీసీ స్టేటస్ ముగిస్తుండటంతో పన్ను రాయితీలు పోతాయి, ఫ్యాక్టరీల మూతలు, పెరిగే ధరలు దివాలియన్స్‌కు దారి తీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

1971 యుద్ధ సహాయానికి ధన్యవాదం చెప్పకుండా భారత వ్యతిరేకత చూపిన బంగ్లాదేశ్ ఇప్పుడు ఆర్థిక శిక్షను ఎదుర్కొంటోంది. మోదీ వ్యూహం డిప్లొమసీ, ఆర్థిక చర్యలతో బంగ్లాదేశ్ పూర్తిగా దివాళా తీయబోతోంది. శ్రీలంకకన్నా దారుణంగా మారబోతోంది. నిత్యావసర ధరలు 300 శాతం పెరిగి ఇబ్బందులు ఎదుర్కొనున్నారు.

# వ్యతిరేకంగా ధర్నా చేశారని..

- **ఎస్ఎఫ్ఐ నాయకుల కిడ్నాప్**
- **వెంటాడి కాపాడిన పోలీసులు**
- **కిడ్నాప్ వివాదంలో మోహన్ బాబు**

**ముద్ర, తిరుపతి:**




తిరుపతిలోని ఎంబీయూ యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ లీడర్లను మోహన్ బాబు బౌన్సర్లు కిడ్నాప్ చేశారు. పోలీసులు వారిని వెంటాడి.. మోహన్ బాబు ఫామ్ హౌస్‌లో గుర్తించి రిలీజ్ చేయించారు. మోహన్ బాబు బౌన్సర్లను అరెస్టు చేశారు. విద్యార్థుల నుండి వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నాలు చేస్తున్నారు. అయితే ఇది మోహన్ బాబుకు నచ్చినట్లుగా లేదు. తన బౌన్సర్లను పంపి వారిని కిడ్నాప్ చేయించారు.

ఎస్ఎఫ్ఐ నేతలను బౌన్సర్లు వాహనంలో తీసుకెళ్తున్న అంశంపై ఎస్ఎఫ్ఐ నేతలు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కిడ్నాపర్లను వెంటాడారు. చివరకు మోహన్ బాబుకు చెందిన ఫామ్ హౌస్‌లో బందీలుగా ఉన్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు గుర్తించి సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు బాధ్యులైన మోహన్ బాబు బౌన్సర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థి సంఘాల నాయకులపై ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడటంపై విస్మయం వ్యక్తమవుతోంది.

యూనివర్శిటీ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసిందని ఇటీవల ఉన్నత విద్యామండలి గుర్తించింది. ఆ అదనపు ఫీజులను వెంటనే విద్యార్థులకు తిరిగి ఇచ్చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, యాజమాన్యం స్పందించకపోవడంతో విద్యార్థి సంఘాలు తమ పోరాటాన్ని ఉధృతం చేశాయి. ఈ క్రమంలోనే నేటి కిడ్నాప్ ఉదంతం చోటుచేసుకోవడంతో మోహన్ బాబు తీరుపై మరోసారి విమర్శలు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణ ప్రజలు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌తో పాటు కొమురవెల్లి, జోగులాంబ కొత్త రైల్వే స్టేషన్లపై కీలక అప్డేట్ వచ్చింది.త్వరలోనే హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ మూడో ఫేజ్ పనులకు ప్రధాని మోదీ భూమి పూజ చేయనున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.అలాగే కొమురవెల్లి,జోగులాంబ రైల్వే స్టేషన్లు కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ్మ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయం పునర్నిర్మాణం తర్వాత ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజధాని హైదరాబాద్ నుంచి కూడా భక్తులు భారీగానే వెళ్తుంటారు. అయితే ప్రస్తుతం బస్సులు, ప్రైవేటు వాహనాల్లో యాదగిరిగుట్టకు వెళ్తుండటంతో డబ్బుతో పాటు, ప్రయాణ సమయం కూడా వృథా అవుతోంది. ఈనేపథ్యంలో నగరం నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ ట్రైన్ నడపాలని ఎప్పట్నుంచో భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ట్రైన్ ప్రాజెక్ట్‌పై తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.

హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట మధ్య నిర్మిస్తున్న ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేస్తారని వెల్లడించారు. భక్తుల విజ్ఞప్తి మేరకు ఘట్కేసర్ నుంచి రాయగిరి స్టేషన్ వరకు ఎంఎంటీఎస్ ట్రైన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ట్రాక్ అందుబాటులోకి వస్తే నగరం నుంచి కేవలం 50 నిమిషాల్లోనే యాదగిరిగుట్ట చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. దాంతో పాటుగా.. తక్కువ ఖర్చు అంటే కేవలం 15 నుంచి 20 రూపాయల టికెట్‌తో జర్నీ చేయొచ్చనని అన్నారు. దీంతో పాటుగా కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లను సైతం త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదు వందే భారత్ ట్రైన్లు, రెండు అమృత్ భారత్ ట్రైన్లకు తెలంగాణకు ఇచ్చిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తాజాగా.. కేంద్ర బడ్జెట్‌లో హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు కూడా ప్రకటించినట్లు తెలిపారు. రూ.5.50 లక్షల కోట్లతో 3 హైస్పీడ్ రైల్ కారిడార్లు హైదరాబాద్ నుంచి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక మేడారం జాతరకు కేంద్రం ప్రకటించిన నిధులను తెలంగాణకు తీసుకొచ్చే బాధ్యత పూర్తిగా తనదేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉచితాల కోసమే కేంద్ర బడ్జెట్ అన్నట్లుగా ప్రజల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఫైరయ్యారు. ఎన్నికల కోసమే కాకుండా భవిష్యత్ తరాలు బాగుండాలని వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్ ఇది అని వెల్లడించారు. ఇప్పటి వరకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణకు కేంద్రం నుంచి 4.30 లక్షల ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు.

# సాహసవీరుడు..

- **నాలుగు గంటలు సముద్రాన్ని ఎదురీది.. కుటుంబాన్ని కాపాడిన బాలుడు**

**ముద్ర, ఢిల్లీ:**



సముద్రంలో కొట్టుకుపోయిన తన తల్లి, తోబుట్టువులను కాపాడుకునేందుకు ఓ బాలుడు పెద్ద సాహసం చేశాడు. అల్లకల్లోలంగా మారిన సముద్రంలో దాదాపు 4 గంటలపాటు భీకర అలలకు ఎదురీది ఎట్టకేలకు తీరానికి చేరుకుని సమాచారం అందించాడు. అప్పటికే చీకటి పడటంతో హెలికాప్టర్ సాయంతో రంగంలోకి దిగిన అధికారులు.. తల్లి, మరో ఇద్దరు పిల్లలను సురక్షితంగా కాపాడారు. ఆస్ట్రేలియాలో ఈ ఘటన వెలుగుచూసింది.

పెర్త్‌కు చెందిన జోవాన్ అపెల్బీ అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి చిన్న పడవలు (కయాక్), పెడల్ బోర్డ్‌ల సాయంతో సముద్రంలో విహారానికి వెళ్లారు. అంతలోనే వాతావరణం మారిపోవడంతో.. వారు క్రమక్రమంగా తీరానికి దూరంగా కొట్టుకుపోయారు. ఈ క్రమంలోనే.. తల్లి సూచనతో పెద్ద కుమారుడు ఆస్టిన్ (13) సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. సాయాన్ని అర్థించేందుకు తొలుత కయాక్‌పై తీరం వైపు బయల్దేరాడు. కానీ, అందులోకి నీరు చేరడంతో మధ్యలోనే వదిలేశాడు. అనంతరం లైఫ్‌జాకెట్‌నూ వదిలేసి.. తీరం వైపు ఈత కొట్టడం ప్రారంభించాడు. ఉద్ధృత అలల నడుమ దాదాపు 4 కిలోమీటర్ల మేర ఈది తీరానికి చేరుకున్నాడు. బాలుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు హెలికాప్టర్ సాయంతో గాలింపు చేపట్టి.. తల్లి, ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఆ సమయానికి వారు తీరానికి 14 కిలోమీటర్ల దూరంలో పెడల్ బోర్డులను పట్టుకుని వేలాడుతూ కనిపించారని చెప్పారు. బాలుడి ధైర్యసాహసాలను ప్రశంసించారు. నలుగురికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరికీ ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం రాలేదన్నారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలను వదిలేసి తాను వెళ్లలేని పరిస్థితి ఉందని, ఆస్టిన్‌ను పంపడం తన జీవితంలో తీసుకున్న అత్యంత కష్టమైన నిర్ణయమని తల్లి జోవాన్ తెలిపారు. సముద్రంలో కొట్టుకుపోయిన మొదట్లో ధైర్యంగానే ఉన్నామని, కానీ.. చీకటి పడేకొద్దీ అలలు ఉద్ధృతంగా మారాయని, చలికి వణికిపోయామని చెప్పారు.

# అమరులే జాతిపితలు

- **కేసీఆర్, కోమటిరెడ్డిలు ఎన్నటికీ జాతిపితలు కాలేరు**
- **తెలంగాణ కోసం పార్టీనే ఎదిరించి.. సర్వస్వం కోల్పోయా**
- **నల్గొండ పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి**

**ముద్ర, నల్గొండ :**



బీఆర్ఎస్ నేతలకు జాతిపిత అంటే అసలు అర్థం తెలియదని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నల్గొండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రాణత్యాగం చేసిన అమరులే జాతిపితలు అని అన్నారు. తెలంగాణ దేవత సోనియా గాంధీ అని ప్రకటించారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అయితే.. నేనూ జాతిపితనే అన్నారు. తెలంగాణ కోసం సొంత పార్టీని ఎదిరించా, పదవులకు రాజీనామాలు చేసి సర్వం కోల్పోయా అని గుర్తుచేశారు. అయినా కేసీఆర్, కోమటిరెడ్డిలు ఎన్నటికీ జాతిపితలు కాలేరని తెలిపారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి పరాభవం తప్పదన్నారు. సర్పంచ్, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృత్తం అవుతాయన్నారు. ఈ ఎన్నికల్లో 5 కార్పొరేషన్లు, 90 మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటాం.. నల్లగొండ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చివరకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 04.02.2026



మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

న_కలం

తెలంగాణ 'జాతిపిత'

## ప్రజల గుర్తింపా? పార్టీ ప్రచారమా?



తెలంగాణ రాజకీయ పోరాటంలో కేసీఆర్ పాత్ర అమోఘం అనడంలో సందేహం లేదు. కానీ ఆయన్ను ఏకంగా 'జాతిపిత'గా నిలబెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నం ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసుల ప్రస్తావన వచ్చినప్పుడు "తెలంగాణ జాతిపితకు నోటీసులా?" అని బీఆర్ఎస్ ప్రశ్నించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. త్యాగాల వల్ల గాంధీజీ జాతిపిత అయ్యారని, కేసీఆర్ లాగా అధికారాన్ని కుటుంబానికి కట్టబెట్టిన వారు కాదని ఆయన విమర్శించడం చర్చనీయాంశమైంది.

**హృదయాల నుంచి రావాల్సిన పిలుపు**

నిజానికి ఏ నాయకుడైనా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవాలి. 'జాతిపిత' వంటి గౌరవం ప్రజల నుంచి స్వచ్ఛందంగా రావాలి తప్ప, పార్టీ కార్యాలయాల నుంచి రుద్దేది కాకూడదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ఇచ్చిన హామీలు.. దళిత ముఖ్యమంత్రి, తన కుటుంబం పదవులకు దూరంగా ఉంటుందన్న మాటలు.. నెరవేరకపోవడం ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపింది. పదేళ్ల పాలనలో వచ్చిన అవినీతి ఆరోపణలు, కుటుంబ పాలన అనే ముద్ర ప్రజల్లో ఆయన పట్ల ఉన్న గౌరవాన్ని కొంత మేర తగ్గించాయనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

**క్రెడిట్ కేవలం ఒక్కరిదేనా?**

తెలంగాణ ఏర్పాటు అనేది వందలాది మంది బలిదానాలు, వేలాది మంది ఉద్యమకారుల పోరాట ఫలితం. కేసీఆర్ రాజకీయ వ్యూహాలతో పోరాటం చేసినా, ప్రజలు ఆ క్రెడిట్‌ను కేవలం ఒక్కరికే ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఉద్యమకారులను విస్మరించడం, తెలంగాణ కోసం పోరాడిన వారిని పక్కన పెట్టి వలస నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు కేసీఆర్‌ను అందరి నాయకుడిగా చూడకుండా చేశాయి.

**బీఆర్ఎస్ పితగా.. తెలంగాణ పితగా?**

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు, పార్టీ ఫిరాయింపులు ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేశాయి. ఇలాంటి సమయంలో కేసీఆర్‌కు 'జాతిపిత' హోదా ఇవ్వడం ద్వారా మళ్ళీ ప్రజల సెంటిమెంటును రగిలించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే, ఆయన బీఆర్ఎస్ పార్టీకి 'పిత' అనడంలో ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు, కానీ తెలంగాణ సమాజం మొత్తానికి పితగా రుద్దే ప్రయత్నం చేస్తే అది ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.

నాయకత్వం అంటే కేవలం అధికారం కాదు, అపారమైన త్యాగం మరియు ప్రజల పట్ల అంకితభావం. కేసీఆర్ ఒక శక్తివంతమైన రాజకీయ నాయకుడనడంలో సందేహం లేదు, కానీ 'జాతిపిత' అనే కిరీటం ప్రజలు ఇష్టపూర్వకంగా పెడితేనే అది నిలుస్తుంది.

# రూ.1000 పెన్షన్‌తో గౌరవంగా ఎలా బతకాలి?



పెన్షన్ అనేది ఒక కార్మికుడు పదవీ విరమణ చేసిన తర్వాత ప్రతి నెల కుటుంబ పోషణ,వృధ్యాప్యంలో ఒకరిపై ఆధారపడకుండా గౌరవ ప్రదమైన ఆత్మ గౌరవం తో జీవించడానికి పొందే సొమ్ము. ఉద్యోగ జీవితంలో సమాజానికి,సంస్థకు తోడ్పడిన తర్వాత పదవీ విరమణ చేసిన వ్యక్తులు వృద్ధాప్యంలో గౌరవంగా జీవించడానికి వీలు కల్పించడం దీని ఉద్దేశ్యం.ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు.1952లో సృష్టించబడిన ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ స్వతంత్ర భారతదేశంలోని మొదటి పెన్షన్ పథకం, పదవీ విరమణ చేసిన కార్మికులకు జీవనోపాధి భద్రత కల్పించడం దీని లక్ష్యం. ఇది ఫ్యాక్టరీ కార్మికులు,రిజిస్టర్డ్ కంపెనీల ద్వారా ఉద్యోగం చేస్తున్న ఇతరులను కవర్ చేసింది. 1972లో స్థాపించబడిన సివిల్ సర్వీస్ పెన్షన్ పథకం, దీనిని ఓల్డ్ పెన్షన్ పథకం అని పిలుస్తారు.ఇది కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులను కవర్ చేస్తుంది.ప్రైవేట్ కంపెనీల ఉద్యోగులు తమ జీతంలో 10 నుండి 12% వరకు తమ ప్రావిడెంట్ ఫండ్‌కు నిర్ణీత వాటాను విరాళంగా ఇచ్చేవారు. వారిని నియమించిన కంపెనీ కూడా అంతే మొత్తాన్ని తమ వాటాగా చెల్లించింది.

బొగ్గు ఉద్యోగులైన కోల్ ఇండియా, సింగరేణి ఉద్యోగులకు కూడ పెన్షన్ పథకం అమలు పరుస్తున్నారు. బొగ్గు ఉద్యోగులకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ద్వారా పెన్షన్ చెల్లిస్తున్నారు.ఈ పెన్షన్ ఫండ్ నిర్వహణ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తూన్నారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీం–1998 అనే చట్టం పార్లమెంట్ లో ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారు. ప్రతీ నెల ఉద్యోగి వేతనం నుంచి 7 శాతం అంతే మొత్తం కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ కు జమ చేస్తున్నారు. కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ స్థిరత్వం కొరకు బొగ్గు యాజమాన్యాలు ప్రతి టన్ను బొగ్గు అమ్మకం పై 20 రూపాయలు పెన్షన్ ఫండ్ కు జమ చేసినను బొగ్గు విశ్రాంత ఉద్యోగులకు నేటి ధరలకు అనుగుణంగా పెన్షన్ పెరగక తల్లడిల్లుతున్నారు.గాలి,వెలుతురు లేని క్లిష్టమైన పరిస్థితిలో దేశానికి వెలుతురు ప్రసాదించిన వీరికి పని దిగిపోయిన రోజు యెంత పెన్షన్ చెల్లిస్తున్నారో జీవితాంతం అంతే మొత్తం చెల్లించడం జరుగుతుంది. దీని వలన చీకటి సూర్యులు గా పిలిచిన వీరికి ధరలకు అనుగుణంగా పెన్షన్ పెరగక దారిద్ర్యంతో బాధ పడుతున్నారు.

బొగ్గు రిటైర్డ్ ఉద్యోగులు పలు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికి ఫలితం శూన్యం.

ప్రైవేట్ కంపెనీ ఉద్యోగుల నుంచి సేకరించిన నిధి లో ఒక నిర్దిష్ట శాతాన్ని ఉద్యోగుల పెన్షన్ పథకంలో జమ చేశారు. ఈ విధంగా సేకరించబడిన నిధిని ప్రభుత్వ బాండ్ల వంటి సురక్షిత సాధనాలలో పెట్టుబడి పెట్టారు, దీని ద్వారా స్థిర వడ్డీ రేటు లభిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ స్కీం విషయంలో ఎటువంటి నిధి సృష్టించబడలేదు. పెన్షన్లు ప్రభుత్వ బడ్జెట్ నుండి చెల్లించబడ్డాయి.

2004లో జాతీయ పెన్షన్ స్కీం ఏర్పాటుతో ప్రైవేట్ కంపెనీలు పెన్షన్ నిధుల నిర్వహణను ప్రారంభించడానికి మార్గం సుగమం అయింది. ప్రస్తుతం పెన్షన్ నిధుల నిర్వహణ ద్వారా లాభం పొందుతున్న కంపెనీలలో ఆదిత్య బిర్లా సన్ లైఫ్ పెన్షన్ మేనేజ్‌మెంట్, టాటా పెన్షన్ మేనేజ్‌మెంట్, కోటక్ మహీంద్రా పెన్షన్ ఫండ్, ఎచ్ డి ఎఫ్ సి పెన్షన్ మేనేజ్‌మెంట్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ మరియు యాక్సిస్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ ఉన్నాయి.పదవీ విరమణ తర్వాత జీవనోపాధికి భద్రత కల్పించడానికి బదులుగా కార్మికులపై మార్కెట్ నష్టాల భారాన్ని మోపే విధంగా ప్రైవేట్ ఆర్థిక సంస్థలకు ప్రయోజనాల కోసం పెన్షన్ వ్యవస్థను నిర్వహిస్తున్నారు

.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ రంగ,ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేసిన వారు ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఇ పి ఎస్)–95 ద్వారా బొగ్గు ఉద్యోగులు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం(సిఎంపిఎస్)–98 ద్వారా నేటి ధరలకు అనుగుణంగా కరువు భత్యం(డి.ఎ) లేకుండా కనీస పెన్షన్ రూ.1,000 లతో జీవించడం అత్యంత బాధాకరం.రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు గత కొన్ని సంవత్సరాల నుంచి కనీస పెన్షన్ పెంచుతూ కరువు భత్యం తో కూడిన పెన్షన్ కావాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు.

ప్రభుత్వాలు ఎన్నో ఉచిత పథకాలు ప్రవేశ పెడుతున్నారు.వృధ్యాప్యంలో ఎదుర్కుంటున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలను తీర్చడానికి బొగ్గు విశ్రాంత ఉద్యోగులకు,ఇతర రంగ రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.10,000 చెల్లించే అవసరం ఎంతైనా ఉంది.

- ఆళవందార్
వేణు మాధవ్
8686051752
హైదరాబాద్



# ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి

దేశాభివృద్ధిలో పట్టణీకరణ ఆధునికీకరణ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాల అభివృద్ధి విస్తరణ ప్రాముఖ్యత సంతరించుకుని ఉంది. ప్రపంచీకరణ విసురుతున్న పోటీని తట్టుకోవాలంటే పట్టణాలు ఆధునిక రీతిలో శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలి. నగరాల/ పట్టణాల అభివృద్ధి అనేది మెరుగైన మున్సిపాలిటీల పాలన విధానాల మీద ఆధారపడి ఉంటుంది. మున్సిపాలిటీలకు నిర్దిష్ట కాలములో ఎన్నికల నిర్వహించి స్థానిక స్వపరిపాలనకు ప్రభుత్వంచర్యలు తీసుకుంటుంది. స్థానిక సంస్థల సాధికారితలో భాగంగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తుంది. మున్సిపాలిటీలో/ మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు/డివిజన్ /కౌన్సిలర్/ కార్పొరేటర్ ల పాత్ర ప్రధాన మైంది. వార్డు /డివిజన్/పట్టణం అభివృద్ధి ప్రజలు ఎన్నుకునే కౌన్సిలర్ కార్పొరేటర్ నాయకత్వ దక్షత మీద ఆధారపడి ఉంటుంది ఎవరిని ఎన్నుకోవాలి? అనేది ఓటర్ల విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది.

***ఓటు తల రాతను మార్చే సాధనం**

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఓటు మాత్రమేకాదు అది మన తలరాతనుమార్చే సాధనం. వార్డ్/ డివిజన్/పట్టణ ప్రజల భవిష్యత్తును పిల్లల భవిష్యత్తు నిర్ధారించే ఒక వజ్రాయుధం. ఎన్నికల్లో డబ్బు ఉచిత ప్రలోభాలు మద్యం కులం బంధువుల వ్యామోహం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మాయమాటల వ్యామోహంలో పడి ఓటర్లు తప్పుడు వ్యక్తిని ఎన్నుకుంటున్నారు. ఫలితంగా నగరాలు పట్టణాలు అభివృద్ధి చెందడం లేదు. పట్టణాలు మురికి కూ పాలుగా కాలుష్య కాసారాలుగా మారిపోయి ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఓటరు తమ ఓటును అభివృద్ధి వైపే వేయాలి అనేధి నినాదానికే పరిమితం చేయకుండా అభివృద్ధికి పాటుపడే అభ్యర్థికేఓటువెయ్యాలి.

**వార్డ్ / డివిజన్ / పట్టణ ప్రగతిని కాంక్షించే వారిని కౌన్సిలర్ గా/ కార్పొరేటర్ గా ఎన్నుకోవాలి.**

రాష్ట్రంలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్/ కార్పొరేటర్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల నేర చరిత్ర' ప్రజాసేవలో వారు చేసిన గణనీయమైన సేవలు ప్రజలతో వారికి వున్న ప్రజా సంబంధాలు' ప్రజలకు ఎల్ల వేళలా అందు బాటులో వుండి వార్డ్/ డివిజన్ / పట్టణ భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను పెంపొందించే శక్తిసామర్థ్యాలు కలిగి పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటు పడే ఉత్తమ అభ్యర్థులను విజ్ఞత గల ఓటర్లు తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలి.

***అందుబాటులో ఉండే వ్యక్తిని ఎన్నుకోవాలి**

వార్డు/ డివిజన్/(పట్టణ) సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలి. ఆపదలో నేను ఉన్నాను అని భరోసా ఇచ్చే నాయకత్వం కావాలి . ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు భరోసానిచ్చి ముందు నిలబడే నిజమైన నాయకుడు కావాలి. గెలిచిన తర్వాత కనపడకుండా పోయేవాడు కాదు .కష్టంలో ప్రజల మధ్య ఉండేవాడు మనకు కావాలి. ఎన్నికునే వ్యక్తి ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలి. సామాన్యులకు అందుబాటులో ఉండాలి .నిజాయితీగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తిని కౌన్సిలర్ గా / కార్పోరేటర్గా ఎన్నుకోవాలి.ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టి గెలిచేవాడు ఆ డబ్బును సంపాదించడం మీద దృష్టి పెడతాడు నిధులను దుర్వినియోగం చేస్తాడు .అవినీతి పాలనకు తెరతీస్తాడు. ప్రజల అభిమానాన్ని నమ్ముకుని సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తిని ఎన్నుకుంటే వార్డు /డివిజన్/ పట్టణం అభివృద్ధి జరుగుతుంది .అవినీతి లేని నేర రహితుడు నిజాయితీ పరుణ్ణి ఎన్నుకుంటే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు యొక్క లాభాలు ప్రత్యక్షంగా ప్రజలకు చేరుతాయి. కౌన్సిలర్ /కార్పొరేటర్ పదవికి పోటీ చేసే అభ్యర్థి వార్డు/డివిజన్లో/ పట్టణంలో విద్యా వైద్య ఆరోగ్య5 వాతావరణ పర్యావరణ రంగాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో? ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు నిధులను ఏ విధంగా సమీకరిస్తాడో బహిరంగంగా ప్రకటించాలి.

***వార్డు / డివిజన్/పరిస్థితులపై అవగాహన ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ కార్పొరేటర్ గా ఎన్నుకోవాలి**

వార్డులో/ డివిజన్లో /పట్టణంలో లభించే భౌతిక వనరులు' సహజ వనరులు 'భౌగోళిక స్థితి గతుల మీధ అవగాహన వున్న విద్యావంతున్ని మేధావిని గుర్తించి ఓటువేయ్యాలి. స్థానికంగాప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి వార్డు /డివిజన్ ప్రజల అభివృద్ధికి పాటుపడే అభ్యర్థులను కౌన్సిలర్ గా /కార్పొరేటర్ గాఓటర్లు ఎన్నుకోవాలి.

***ప్రలోభాలు వద్దు_ నిజాయితీ ముద్దు**

వార్డు /డివిజన్లోని (పట్టణ)ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దు.నోటుకు ఓటు అమ్ముకోవద్దు. ఎన్నికల సమయంలో ఇచ్చే 5 వేల రూపాయలకు ఆశపడి భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దు. నాయకుడు ఎన్నికల్లోకోట్లు ఖర్చు చేసి గెలిచిన తర్వాత అంతకుమించి సంపాదిస్తాడు. ప్రజలను దోపిడి చేస్తాడు. ప్రజలకు సేవ చేయాలనే స్పృహ నేటి నాయకుల్లో లేదు. ఈరోజు డబ్బు తీసుకొని మనం ఓటు వేస్తే రేపు మన వార్డ్/డివిజన్కు కావాల్సిన మౌలిక మవసతులు రోడ్లు 'విద్య ఆరోగ్యం సదుపాయాలు రావు.

ప్రశ్నించే హక్కును కోల్పోతాము. నోటుకు ఓటు భవిష్యత్తుకు ముప్పుగా భావించాలి.

***ప్రజా సేవకులను కౌన్సిలర్ గా కార్పోరేటర్స గా ఎన్నుకోవాలి**

ఓటర్లుఎలాంటి ఒత్తిడికి భయానికి తల వంచకుండ హేతుబద్ధంగా వ్యవహరించాలి. ప్రజలకు సేవ చేస్తున్న వారిని నిజంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

***సెంటిమెంట్ పై ఓటు వేయరాదు**

కౌన్సిలర్ /కార్పొరేటర్అభ్యర్థి మనకులం మన మతం' మన బంధువు మా అన్నమా తమ్ముడు మా బావ మామామ అనే సెంటిమెంట్లతో ఓటు వేయడం అభివృద్ధికి అవరోధం. నాయకుడు సమర్థుడా? కాదా ?ప్రజా సమస్యలు పై అవగాహన ఉందా లేదా ?అని ఆలోచించాలి ? అభ్యర్థి ఏ పాటి వాడో చూడాలి.

కేవలం కులం మతం బంధుత్వం వర్గం ప్రాతిపదికన ఓటు వేస్తే గెలిచిన నాయకుడు తన కులానికి తన వర్గానికి మేలు చేస్తాడు . వార్డుకు డివిజన్ కు న్యాయం చేయలేడు.

***వార్డ్/ డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే వారిని ఎన్నుకోవాలి.**

అభివృద్ధికి కులం లేదు. ఆకలికిm మతం లేదు. రోడ్లు 'తాగు నీరు 'బడి మౌలిక వసతులు' పర్యావరణం ప్రజలందరికీ కావాలి. సంకుచిత భావాలనుండి ఓటరు బయటపడి వార్డు /డివిజన్ సమగ్ర అభివృద్ధి కొరకు పాటుపడే సామర్థ్యం నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ గా కార్పొరేటర్ ఎన్నుకుంటేనే వార్డు/ డివిజన్ /పట్టణ ప్రజల జీవితాలలో వెలుగులు వస్తాయి. ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రగతి పురోగతి కోసం మనస్ఫూర్తిగా పని చేస్తానని నమ్మే అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

***నిజాయితీ సామాజిక సేవ ఎన్నికకు గీటురాయి**

నిజాయితీ గల అభ్యర్థికి ఓటు వెయ్యాలి. ఒక అభ్యర్థిని ఎన్నుకునేటపుడు అభ్యర్థి ఎంత సామాజిక సేవ చేశాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక సేవా పాలనా దక్షత ప్రజా సంబంధాలు నిబద్ధత నీతి నిజాయితీ అభ్యర్థి ఎన్నికకు గీటు రాయి కావాలి.ఓటర్లు మద్యానికి మందుకు బీరు బిర్యాని ముక్క చుక్కకు బానిసలై అవినీతి పరులను ఎన్నుకోవద్దు. అసమర్థులను అవినీతి పరులను ఓటుతో వేటు వెయ్యాలి . ఓటు ద్వారా వారిని బహిష్కరించాలి.




***ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి*.**

ఓటర్లు గాఢ నిద్ర మానుకొని ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో కౌన్సిలర్గా /కార్పొరేటర్ గా బాధ్యతలను నిర్వహించే సామర్థ్యం వున్న వారిని గుర్తించాలి. విద్యావంతులైన అభ్యర్థి మెరుగైన నిర్ణయాలు తీసుకోగలడని సాధారణ ఓటరు అర్థం చేసుకోవాలి. కౌన్సిలర్/ కార్పొరేటర్ అభ్యర్థి కి వార్డు డివి జన్ స్థితి గతులు పరిస్థితుల మీద మేధస్సుతో కూడిన దూర దృష్టితో కూడిన అభివృద్ధి దృక్పథం కలిగి వుండాలి.నేర రికార్డులు ఉన్న అభ్యర్థిని బహిష్కరించాలి. ఉచితాలకు స్వస్తి పలకాలి. ఉచితాలు ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు చేసే చర్యలు చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించి అభ్యర్థి పైన ఎన్నిక కమిషన్ చర్యలుతీసుకోవాలి.

***పరిస్థితులపై అవగాహన**

వార్డు/ డివిజన్ /(పట్టణ) పరిస్థితులపై సంపూర్ణ అవగాహన. సామాజిక ఆర్థిక చారి త్రిక సాంస్కృతిక అంశాల పై అవగాహన వుండాలి.

కౌన్సిలర్ /కార్పొరేటర్ అభ్యర్థులకి వార్డు డివిజన్ సరిహద్దులు తెలిసివుండాలి. ప్రభుత్వ భూమిరక్షణ వినియోగం పబ్లిక్ పార్కు వినియోగం విస్తరణ వీక్లీ సంత మార్కెటింగ్ 'స్టోరేజ్ సౌకర్యాలు 'ఉత్పత్తి ఉత్పాదకత చిన్న ' కుటీర లఘు ' పరిశ్రమలు పెట్టుబడి వాటి నిర్వహణ పనితీరు ఉపాధి సృష్టి ఆదాయ సృష్టి 'అటవీ సంరక్షణ 'పర్యావరణ ప్రకృతి విపత్తుల చట్టాల పట్ల అవగాహన పరిజ్ఞానం ఉండాలి.

***సంక్షేమ చట్టాల పట్ల అవగాహన**

మహిళా ' యువజన' ఎస్సి ఎ'స్టీ 'బి'సి సాధికారిత సంక్షేమం అభివృద్ధి పథకాలు చట్టాల పట్ల అవఘానుండాలి నిర్ణిత కాలములో వారినిఅమలు చేసే సత్తా ఉండాలి..విద్యుత్ శక్తి తాగునీటివనరుల ప్రాజెక్ట్ నిర్మాణం నాణ్యత పట్ల అవగాహన పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటర్లు తమ ఓటు హక్కుతో మద్ధత్తు ప్రకటించాలి.

***వార్డు/ డివిజన్ అభివృద్ధిపై విజన్ ఉండాలి**

కౌన్సిలర్గా/ కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థికి వార్డు డివిజన్ అభివృద్ధిపై స్పష్టమైన విజన్ ఉండాలి.వార్డు/ డివిజన్ లోని ప్రజల జీవన విధానం విధ్య' వైద్య రావణా 'కరంట్ ' డ్రైనేజ్ మౌలిక వసతుల కల్పనకు సామాజిక అవస్థాపన పెట్టుబడులు 'మూలధన వనరుల సమీకరణ వనరుల అభిలషణీయ వినియోగం పట్లనిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసిన విశ్వసనీయ అభ్యర్థులకు విజ్ఞత గల ఓటర్లు ఓటు వెయ్యాలి.

***మేనిఫెస్టో అమలు సమీక్ష సమావేశాలు నిర్వహించాలి**

ఎన్నికైన కౌన్సిలర్ /కార్పొరేటర్ / ప్రతి 3 నెలలకు ఒక సారి వార్డు /డివిజన్/పట్టణ సభ విధిగా నిర్వహించాలి. ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాల అమలు పట్ల సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రగతి సంక్షేమ పథకాల అమలులో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి.వార్డు /డివిజన్లో లోని ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే పన్నులు వార్డు /డివిజన్అభివృద్ధికి కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు వాటి వినియోగం మీధ ఓటర్లతో సమావేశాలు నిర్వహించాలి.

***ప్రజల వద్దకు పాలనను అందించాలి**

ఎన్నికైన కౌన్సిలర్/ కార్పొరేటర్ లు వార్డు/ డివిజన్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజల పిర్యాదులను సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల ద్వారా వారం రోజుల్లో పరిష్కారమయ్యే పాలన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి 3 నెలలకు ఒక సారి జిల్లా స్థాయి వివిధ విభాగాల అధికారులు వార్డు/డివిజన్ పరిధిలో ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎంపీల సమావేశాన్ని నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి. వార్డు /డివిజన్ ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అసెంబ్లీకి పార్లమెంట్కు వెళ్ల లేరు. ఎమ్మెల్యేలు ఎంపీలు హాజరైతే ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై వారికి అవగాహన ఏర్పడుతుంది ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్యన సంబంధాలు బలోపేతం అవుతాయి.

**మునిసిపాలిటీ సిబ్బందిలో అధికారులలో జవాబుదారీతనం**

ప్రజల వద్దకు పాలనను చేర్చే చర్యలు చేపట్టాలి.ఓటర్ల అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి రక్ష. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవలిసిన బాధ్యత ఓటర్ల పై వుంది. ఓటర్లు అప్రమత్తంగా వుండి అర్హులైన అభ్యర్థులను కౌన్సిలర్ గా/ కార్పొరేటర్ గా ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి. అభ్యర్థుల హామీలను పరిశీలించి వారి పని తీరును పరిశీలించాలి.వార్డు/డివిజన్ /పట్టణం భవిష్యత్తు విజ్ఞత గల ఓటర్ల చేతుల్లోనే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు. డ్రగ్స్ 'అవినీతి భూ మాఫీయా ' ఇసుక మాఫియా ' పేదరికం నిరుద్యోగం సామాజిక' ఆర్థిక అసమానతలు 'లింగ వివక్ష లైంగిక వేదింపులు 'సామాజిక హింస బాలకార్మికులు నిర్మూలన వెట్టిచాకిరి యువత విద్యార్థుల ఆత్మహత్యలు మొన్నగు సమస్యలను తుడిచి పెట్టే సామర్థ్యం వున్న విద్యావంతులు నిజాయితీ గల అభ్యర్తులను కౌన్సిలర్గా/ కార్పొరేటర్స్ గా ఓటర్లు ఎన్నుకోవాలి. వార్డు/ డివిజన్ /(పట్టణాన్ని) ప్రగతి శీలంగా ప్రజాస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసే అభ్యర్థిని కౌన్సిలర్/ కార్పొరేటర్ గాఎన్నుకుంటామని ఓటర్లుగా ప్రతిజ్ఞ చేద్దాం. సకల జనుల సంక్షేమానికి వార్డు /డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటేద్దాం. ఓటుతో ప్రజలజీవితాల్లో వెలుగులు తెద్దాం.

- నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్
9440245771

టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

WTO ఒప్పందాలు : ప్రపంచ వాణిజ్యానికి ఒకే రూల్‌బుక్ ఇచ్చాయి. టారిఫ్‌లు తగ్గించడం, వివాద పరిష్కారంలో కీలకం.




# నారాయణపేట పురపోరులో త్రిముఖ పోటీ

- 24 వార్డులకు 96మంది అభ్యర్థులు బరిలో
- కింగ్‌మేకర్‌గా టీఆర్ఎస్ కీలక పాత్ర

**ముద్ర, నారాయణపేట :**



నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ ప్రచారం కొనసాగుతోంది. ప్రారంభంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉంటుందని అంచనా వేసినా, ఇటీవల జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీతో టీఆర్ఎస్ కూడా ప్రధాన పోటీదారుగా మారినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నామినేషన్ల చివరి రోజు నాటికి మున్సిపల్ పరిధిలోని 24వార్డులకు మొత్తం 202 నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతరం స్క్రూటినీ, ఉపసంహరణ, రాజకీయ పార్టీల బీఫారాల ప్రక్రియ పూర్తయ్యాక చివరకు 96 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో బీజేపీ నుంచి 24 మంది, టీఆర్ఎస్ నుంచి 24 మంది, కాంగ్రెస్ నుంచి 22 మంది, ఏఐఎంఐఎం నుంచి 2 మంది, స్వతంత్రులుగా 21 మంది, ఇతర రాజకీయ పార్టీల నుంచి 3 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. విత్‌డ్రా రోజున మొత్తం 28మంది అభ్యర్థులు బరిలో నుంచి తప్పుకున్నారు. అయితే నారాయణపేట మున్సిపల్ పరిధిలోని కొన్ని వార్డులకు ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ఖరారు చేయకపోవడం గమనార్హంగా మారింది.

**కింగ్‌మేకర్‌గా మారనున్న టీఆర్ఎస్..**

నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ కింగ్‌మేకర్ పాత్ర పోషించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ లేదా బీజేపీ పార్టీలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు అవసరమైన పూర్తి మెజారిటీ రాకపోతే, టీఆర్ఎస్ మద్దతు ఎవరికైతే లభిస్తుందో వారికే మున్సిపల్ పీఠం దక్కే అవకాశం ఉంది. టీఆర్ఎస్‌కు కనీసం నాలుగు నుంచి ఆరు వరకు కౌన్సిలర్ స్థానాలు వచ్చే అవకాశముందని అంచనా. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ సత్తా చాటాలనే లక్ష్యంతో ఎస్. రాజేందర్‌రెడ్డి వార్డుల వారీగా ముమ్మర ప్రచారం కొనసాగిస్తున్నారు. కాగా కాంగ్రెస్ ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా సరిత హరినారాయణ భట్టాడ్‌ను ప్రకటించింది. అయితే బీజేపీ వైపు నుంచి ఇప్పటివరకు చైర్‌పర్సన్ అభ్యర్థిపై స్పష్టత రాలేదు.

# బాపునగర్ ఈద్గా పరిశీలన

**ముద్ర, శేరిలింగంపల్లి :**



శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని బాపునగర్ ఈద్గాను ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఈద్గా ఆవరణను సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఈద్గా ఒకేసారి వేలాది మందిని ఏకం చేసే పవిత్ర ప్రదేశమన్నారు. కుల, మత, ఆర్థిక భేదాలు లేకుండా అందరూ భుజం భుజం కలిపి ప్రార్థించే సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈద్గాను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈద్గా ఆవరణలో ఏవైనా చిన్న సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన వెంటనే ముస్లిం సోదరుల కోసం ఈద్గా ఆవరణలో స్టోన్ ఫ్లోరింగ్ వేయించానని అన్నారు. ప్రస్తుతం అది శిథిలావస్థలో ఉన్నందున సీసీ ఫ్లోరింగ్ వేయిస్తానని తెలిపారు. అలాగే సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాకీర్, ఇక్బాల్, రాజ్‌కుమార్, ఆజాం, గఫర్, జావేద్, ఖాదర్ ఖాన్, అశోక్, షెహబాజ్ యాబా, టిల్లు, తాహెర్, దస్తగిర్, అలీం, అజాజ్, షకీల్, రియాజ్, ముక్రం, షాకీర్, గౌస్, ఖలీం, మహేష్ చారీ, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్ నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ముద్ర, మల్కాజిగిరి :**

గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ మేకల సీతారామ్ యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ నిర్మాణ పనులను మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో గౌతమ్ నగర్ డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ పట్నాయక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లైసెన్స్డ్ ఆయుధాలు పోలీస్ స్టేషన్‌లో జమ చేయాలి

- సీపీ అవినాష్ మహంతి

**ముద్ర, మల్కాజిగిరి :**

మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పలు ముందస్తు చర్యలు చేపట్టారు. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లైసెన్స్డ్ ఆయుధాల యజమానులు తమ ఆయుధాలను తాత్కాలికంగా సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా గుర్తింపు పొందిన ఆయుధ డీలర్ వద్ద డిపాజిట్ చేయాలని సూచించారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో గార్డులుగా పనిచేస్తున్నవారు, భద్రతా సిబ్బందికి ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫిబ్రవరి 15 నుంచి లేదా ఆ తర్వాత ఆయుధాలను తిరిగి పొందవచ్చని తెలిపారు. ఈ చర్యలు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసి, ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సహకారానికి ముందుగానే కృతజ్ఞతలు తెలియజేశారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీలేని కృషి చేస్తా

- అడ్డగుట్ట కాలనీలో పర్యటించిన పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీలో పలు ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. అడ్డగుట్ట సొసైటీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్లను ఆక్రమించి, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీంతో స్థానిక ప్రజలు ముఖ్యంగా మహిళలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఫిర్యాదులకు స్పందించిన అరికపూడి గాంధీ స్వయంగా రంగంలోకి దిగారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులు, షాపులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి తొలగించారు. ఈ చర్యతో ట్రాఫిక్ సమస్య తీరడంతో అడ్డగుట్ట సొసైటీ మహిళలు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్మన్ అరికపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వ్యాపారం చేయడాన్ని ఎవరూ నిరోధించరు. కానీ ఇతర ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా షాపులు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ప్రజా సమస్యలపై రాజీలేని చర్యలు కొనసాగుతాయి.." అని స్పష్టం చేశారు. అడ్డగుట్ట కాలనీలో మౌలిక వసతులు ఇప్పటికే చాలా వరకు కల్పించామని, అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా కార్పొరేటర్ దృష్టికి గానీ, తన దృష్టికి గానీ తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణపై నిశిత పరిశీలన

- మైక్రో అబ్జర్వర్లకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశం

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**



ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పోలింగ్ సరళిని సూక్ష్మస్థాయిలో పరిశీలనకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగల్గుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లది కీలక భూమిక

- ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని మూడు చింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికల సందర్భంగా పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి తెలిపారు. ఈ దిశగా వారు విధులను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొర్ర లక్ష్మి మాట్లాడుతూ.. పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ విధులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. చెక్‌లిస్ట్ ప్రకారం బూత్‌లోపల, బయట నిరంతర సూక్ష్మ పరిశీలన చేపట్టాలని తెలిపారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన తర్వాతే విధులు నిర్వహించాలని, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు జనరల్ అబ్జర్వర్ల ఆధ్వర్యంలో పని చేయాల్సి ఉంటుందని, ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమిస్తామని తెలిపారు. విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు రోజే మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని మాక్ పోలింగ్ విధానం, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ ఏజెంట్ల నియామకాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌కు వచ్చే ఓటర్ల వద్ద ఓటర్ గుర్తింపు కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులు ఉన్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు. ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించారా లేదా గమనించాలని, పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇచ్చారా లేదా కూడా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ అనంతరం ఫారాలు సక్రమంగా నింపారా లేదా అన్న అంశాలను నివేదికలో నమోదు చేయాలని తెలిపారు. తదుపరి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధి విధానాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు పూర్తి

- రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి
- -6న శిక్షణ తరగతులు

**ముద్ర ప్రతినిధి- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**



మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయాంక్ మిత్తల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించారు. జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డు వారీగా ఎన్నికల విధులు నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది, అలాగే ఓట్ల లెక్కింపు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ సిబ్బందికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్ల ద్వారా మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. పోలింగ్ నిర్వహణ విధానాలు, ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించామన్నారు. రెండో విడత శిక్షణ తరగతులను ఈ నెల 6వ తేదీన సంబంధిత సిబ్బందికి కేటాయించిన కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు ఎవరైనా గైర్హాజరు అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో హైడ్రామా..!

- నామినేషన్ ఉపసంహరణతో ఒక్కసారిగా మారిన సమీకరణాలు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో మంగళవారం తీవ్ర రాజకీయ ఉత్కంఠత నెలకొంది. టీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మూర్తుజా అలీ, కాంగ్రెస్ నాయకుల ప్రలోభాలకు లోనై తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిసింది. నామినేషన్ ఉపసంహరణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఆయన మున్సిపల్ కార్యాలయానికి పరుగెత్తుకుంటూ వెళ్లి సకాలంలో విత్‌డ్రా ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో 1వ వార్డును ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించినట్లయ్యాయి. ఈక్రమంలో మున్సిపల్ కార్యాలయ గేట్ వద్ద టీఆర్ఎస్ నాయకులు మూర్తుజా అలీని అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయినప్పటికీ గడువు ముగిసేలోపే నామినేషన్ ఉపసంహరణ జరగడంతో కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవంలో విజయం సాధించినట్లు వెల్లడైంది. ఈ పరిణామాలతో మున్సిపల్ ఆవరణలో కొంతసేపు హైడ్రామా చోటుచేసుకుంది.

# డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి

- చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి

**ముద్ర, కుషాయిగూడ :**

కుషాయిగూడ డివిజన్ పరిధిలోని హనుమాన్ కాలనీని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి పలు పౌర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కాలనీవాసుల సమస్యలను శ్రద్ధగా విన్న కార్పొరేటర్ సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్‌కి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**ముద్ర, శేరిలింగంపల్లి :**

వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పట్టపగలు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని చందానగర్ పోలీసులు సైబరాబాద్ ఎస్ఓటీ, సీసీఎస్ బృందాల సహకారంతో అరెస్ట్ చేసినట్లు శేరిలింగంపల్లి ఏసీపీ సిహెచ్. వై. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. చందానగర్ పరిధిలో జరిగిన రెండు చైన్ స్నాచింగ్ ఘటనలకు సంబంధించి రెండు వేర్వేరు ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. వాటిపై కేసులు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. గత నెల 31న మధ్యాహ్నం బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ పరిధిలోని రామాలయం టెంపుల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న 72 ఏళ్ల వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును నిందితుడు తెంచుకుని పరారయ్యాడన్నారు. అదే సమయంలో సమీపంలోనే మరో 73 ఏళ్ల వృద్ధ మహిళను అడ్డగించి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయినట్లు వివరించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని రంగారెడ్డి జిల్లా లింగంపల్లి గోపీనగర్‌కు చెందిన డి.రాజేష్ (32)గా గుర్తించామని తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# వికారాబాద్ మున్సిపాలిటీలో రెండు వార్డులు ఏకగ్రీవం

**ముద్ర, వికారాబాద్ బ్యూరో :**

వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో మున్సిపాలిటీ పరిధిలోని రెండు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచేందుకు తొలుత మొత్తం 179మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి 67మంది తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషనర్ స్పష్టం చేశారు. ఏకగ్రీవమైన వార్డులు పోను, మిగిలిన 32వార్డుల్లో మొత్తం 112మంది అభ్యర్థులు తుది పోటీలో నిలిచారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నట్లు ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కమిషనర్ సూచించారు.

## టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

CPTPP (ఆసియా–పసిఫిక్ దేశాలు)

అధునాతన డిజిటల్, సేవల వాణిజ్య ప్రమాణాలతో కొత్త తరం FTA. ఆసియా–పసిఫిక్ వాణిజ్యానికి బలమైన ఫ్రేమ్ వర్క్.




# బీఆర్ఎస్ అంటే భూ రాక్షసుల సమితి

- 10 ఏళ్ల పాలనలో కనబడ్డ జాగాలన్నీ కబ్జా చేశారు - మళ్లీ బీఆర్ఎస్ ను గెలిపిస్తే మీ ఇండ్లను కూడా కబ్జా చేస్తారు
- కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద పైసల్లేవు - 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ను నిలదీయండి
- కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే.... మోదీని ఒప్పించి పెద్ద ఎత్తున నిధులు తెస్తా..
- ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్





**ముద్ర, కరీంనగర్:**
బీఆర్ఎస్ అంటే భూ రాక్షసుల పార్టీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కనబడ్డ జాగాలన్నీ కబ్జా చేసి దోచుకుతిన్నారని మండిపడ్డారు. కరీంనగర్ లో భూకబ్జాలు చేసి ప్రజలను అరిగోస పెట్టిన 46 మంది బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. పొరపాటున బీఆర్ఎస్ ను గెలిపిస్తే.. మీ ఇండ్లను కూడా కబ్జా చేసి పుస్తెల తాడును కూడా దోచుకుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద నయాపైసా లేదని, నన్ను కోసినా డబ్బులు రావని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డే చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే... మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుండి తెస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయకుండా నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ నేతలు ఓట్ల కోసం వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని కోతిరాంపూర్ చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. మాజీ మేయర్ సునీల్ రావుతో పాటు 9, 39, 40, 62, 63, 64 డివిజన్ల అభ్యర్థులు బండారు గాయత్రి, పసుపులేటి శివానందం, కాసర్ల లక్ష్మీ నర్సవ్వ, పెద్దపల్లి శ్రీలేఖ, దేశ శిల్పా వేదం, గాదె శ్రీలేఖ పక్షాన ప్రచారం నిర్వహించారు. ఈ 6 డివిజన్ల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎ స్ పార్టీలపై నిప్పులు చెరిగారు.

కరీంనగర్ అభివృద్ధి కోసం రూ.1500 కోట్లు తీసుకొచ్చానని, తాను ఏయే పనులు చేశానో ఆ వివరాలతో బుక్ లెట్ కొట్టించి ఇంటింటికీ పంపుతున్నానని తెలిపారు. ఈ బుక్ లో ఉన్న వివరాలు తప్పయితే తనపై కేసు పెట్టుకోవచ్చని సవాల్ చేస్తున్నానని అన్నారు. ఈ రోడ్డు.. పైన కల్పించే లైట్ల పైసలన్నీ స్మార్ట్ సిటీ నిధులతో వేసినవే.. అంబేద్కర్ స్టేడియం నుంచి గణేష్ నగర్ రోడ్డు దాకా అప్పుడెట్ల ఉండేదో, ఇప్పుడెట్లా ఉందో ఒక్కసారి యాది జేసుకోండి.. అసలు ఈ రోడ్డు ఇంత బాగా అయితుందని ఊహించలేదని ఇక్కడి ప్రజలే చాలా సార్లు చెప్పారు. ఇదంతా మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే సాధ్యమైందని అన్నారు. ఒకప్పుడు ముంపు ప్రాంతంగా ఉన్న అల్కాపురి కాలనీ ఇప్పుడు మినీ బంజరా హిల్స్ లెక్క ఎట్లా మారింది. పెద్దపోచమ్మ టెంపుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులే కారణమని కేంద్ర మంత్రి తెలిపారు.

కోతి రాంపూర్ నుంచి కట్టరాంపూర్ వరకు రోడ్డు నిర్మాణం గిద్ద పేరిమళ టెంపుల్ వరకు పూర్తయింది. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే ఆగిపోయినయ్. 39వ డివిజన్లో చాలా సిసి రోడ్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినం. కానీ ఈ ప్రభుత్వం వాటికి నిధులు ఇవ్వకుండా డైవర్ట్ చేస్తుంది. మీ అందరి ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్ లో బిజెపి అధికారంలోకి రాగానే మొదటగా ఈ పెండింగ్ పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. డంపింగ్ యార్డ్ దుస్థితికి మొదటి దోషి బీఆర్ఎస్సే. డంపింగ్ యార్డ్ ను అక్కడ నుంచి తొలగించాలని మీ తరపున కొట్లాడినం. ఆనాటి సీఎంకు కూడా లేఖలు రాసిన. కానీ పట్టించుకోలే. రెండోసారి తాను ఎంపీగా గెలిచాక కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కరీంనగర్ తీసుకొచ్చినంక రూ. 50 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. స్మార్ట్ సిటీలో అక్కడ ఉన్న చెత్తను బయోమైనింగ్ చేసేందుకు రూ,18 కోట్లు కూడా కేంద్ర నిధులు రడీగా ఉన్నయ్. టెండర్ పని కూడా పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపకుండా కావాలని జాప్యం చేస్తుందని అన్నారు. నాడు బిఆర్ఎస్, ఈనాడు కాంగ్రెస్ ఇద్దరూ ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు.

భూ రాక్షసుల సమితికి రెండే లక్ష్యాలు. ఎవరి పొట్ట కొట్టాలి. ఎట్లా పైసలు సంపాదించాలని, ఈ రెండే వాళ్ళ నినాదాలని అన్నారు. ఈ భూ రాక్షసుల మీద పోలీస్ స్టేషన్లలో 2,600 కు పైగా ఫిర్యాదులు అందాయంటే వీళ్ళ అరాచకాలు ఏ విధంగా సాగాయో గుర్తించాలని, ఈ ఒక్క సారి ఆలోచించి నిర్ణయం తీసుకోండని ప్రజలకు కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద పైసల్లేవు. 6 గ్యారంటీలను అమలు చేయడం లేదు. నన్ను కోసినా నయాపైసా లేదని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డే చెప్పిండని గుర్తు చేశారు. పెండింగ్ లో ఉన్న పనులన్నీ పూర్తి కావాలంటే బీజేపీని గెలిపించి మేయర్ పీఠం అప్పగిస్తే.. కరీంనగర్ కు ఎన్ని వందల కోట్లు అయినా ఇస్తానని ప్రధాని మోదీ చెప్పారని అన్నారు. భూకబ్జాలతో ప్రజలను అరిగోస పెట్టిన బీఆర్ఎస్ ను, దొంగ హామీలతో నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ ను నిలదీయాలని అన్నారు.

కరీంనగర్ లో 56 మంది కార్యకర్తలకే టిక్కెట్లు ఇచ్చాం. వాళ్లు దేశం కోసం, ధర్మం కోసం కొట్లాడే కార్యకర్తలు. కొన్ని రాజకీయ సమీకరణలు, గెలుపు అవకాశాల దృష్ట్యా టిక్కెట్లు రాకపోవచ్చు. అంత మాత్రాన నిరాశ పడాల్సిన పనిలేదు. ఎవరికైనా టిక్కెట్ రాకపోతే వారికి పార్టీ పరంగా న్యాయం చేస్తామని తెలిపారు.

10 ఏళ్ల బీఆర్ఎస్ అవినీతికి మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధమిది. రెండేళ్ల పాలనలో చిల్లి గవ్వ కూడా ఇవ్వని కాంగ్రెస్ కు, రెండేళ్లలో అభివృద్ధి పనుల కోసం వందల కోట్లు కేటాయించిన బీజేపీకి మధ్య జరుగుతున్న యుద్ధమిది. కరీంనగర్ అభివృద్ధి కోసం నిధులు తెచ్చి యుద్ధం చేసే బీజేపీకి కత్తి ఇస్తారా?... డాంబికాలు చెప్పి మోసం చేసే కాంగ్రెస్, బీఆర్ఎస్ కు పట్టం కడతారా? ఆలోచించాలని ప్రజలను కేంద్రమంత్రి సంజయ్ కోరారు.

## టియుడబ్ల్యూజే-2026 డైరీని ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ - IJU) ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన సంవత్సర డైరీని మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం ఆయన కార్యాలయంలో డైరీని ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర వహిస్తుందని సమాజ హితానికి జర్నలిస్టులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకు వచ్చే బాధ్యతాయుత పాత్రను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు మీడియాకు సహకరిస్తుందని, శాంతి భద్రత పరిరక్షణలో జర్నలిస్టుల సహకారం అవసరమని అన్నారు. మంచి సమాచారంతో మీడియా డైరీని ముద్రించిన టియుడబ్ల్యూజే నాయకులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, కోశాధి కారి గాజుల వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి ఊరడి రవీందర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిగేటి శ్రీనివాస్, కంకణాల రఘు, రేగుల నర్సింగం జి కేశవరెడ్డి, ఎండీ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## 50 సీట్లు బీజేపీ టార్గెట్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు సింగిల్ డిజిట్ సీట్లే...
- మూడో స్థానం కోసమే పోటీ పడుతున్నాయి: బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ 50 సీట్ల లక్ష్యంతో దూసుకెళ్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సింగిల్ డిజిట్ సీట్లే వస్తాయని.. అవి మూడో స్థానం కోసం మాత్రమే పోటీ పడుతున్నాయని తెలిపారు. తాజా సర్వే నివేదికలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో బిజెపి కార్పొరేటర్ అభ్యర్థులకు ప్రచార వ్యూహాలపై ఆయన మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం 35 సీట్ల అంచనాను 50 దాటిం చడమే లక్ష్యమ న్నారు. రాష్ట్ర ప్రజల దృష్టి అంతా కరీంన గర్ కార్పొరేషన్ పైనే ఉందని, మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు నిర్మాణం ఆపడం తగదు

**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ నగరంలోని 21వ డివిజన్, శ్రీ విజయ దుర్గ కాలనీ సమీపంలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయడం తగదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భూమి పూజ చేసిన అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. అయితే డివిజన్‌కు సంబంధం లేని వ్యక్తి ఆధారాలు లేకుండానే ఫిర్యాదు చేయడంతో పోలీసులు పనులను ఆపివేయడం వివాదాస్పదమైంది. ఈ విషయాన్ని కాలనీవాసులు ఎమ్మెల్యే గంగుల దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్థలానికి చేరుకుని స్పందించారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన రోడ్డు పనులను భూకబ్జాదారులు అడ్డుకుంటున్నారని, తెలిసి కూడా పోలీసులు మద్దతివ్వడం సరికాదని రూరల్ సీఐ కొటేశ్‌ను ప్రశ్నించారు. వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కాలనీవాసులతో కలిసి అక్కడే ఉండి పనులు పూర్తయ్యే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట సుమారు 50 మంది కాలనీవాసులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రయోగాలు సమాజానికి ఉపయోగపడాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ముద్ర, కరీంనగర్:**
విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు కేవలం సైన్స్ ఫెయిర్లకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే వస్తువుల్లాగా మారడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కుమార్వాడి)లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలోని 17, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 8 అటల్ టింకరింగ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న వివిధ పాఠశాల విద్యార్థులు తమ ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయి ఎగ్జిబిషన్ ఎక్కడ జరిగినా అటల్ టింకరింగ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న పాఠశాల విద్యార్థులు పాల్గొనడం మంచి విషయమని అన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, కోతుల సమస్య–పరిష్కారం వంటి ఎన్నో ఆవిష్కరణలను విద్యార్థులు తమ ప్రాజెక్టుల ద్వారా రూపొందించారని తెలిపారు. జిల్లాలోని 35 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రయోగాలను ప్రదర్శించేందుకు, మరిన్ని సైన్స్ ఆవిష్కరణలు రూపొందించేందుకు కరీంనగర్ లో జిల్లా సైన్స్ మ్యూజియంను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన వస్తువులు వినియోగ వస్తువులుగా మారి సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. అందుకు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, యూనిసెఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గిరిజాశంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### "ఆలిండియా ఓవరాల్ ఛాంపియన్" సాధించిన బధిర విద్యార్థులకు అభినందన

గత నెల 29 నుండి ఈనెల 1 వరకు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో " ది సైలెంట్ ఒలంపియాడ్ -2026" పేరుతో ముంబైలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. 28 మంది విద్యార్థులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవి ష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణిం చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ చాటారని అన్నారు. అంత ర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో జరిగే క్రీడా పోటీల్లోనూ ఈ విద్యార్థులు పాల్గొనేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ బధిర విద్యార్థులు రాణించేందుకు సంసిద్ధం చేయాలని, మరింత శిక్షణ ఇప్పించాలని అన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, బదిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.కమల ఉదయ కుమారి, ఉపాధ్యాయులు జే.తులసీరామ్, కె.శ్రీనివాస్ ఎన్.సుజాత, బి.అఖిల్, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

## బీజేపీలో ప్రతిజ్ఞా పర్వం

### గెలిచిన తర్వాత పార్టీ వీడను..
### కరీంనగర్ ప్రజల సేవకే అంకితం



**ముద్ర, కరీంనగర్:**
అయారాం–గయారాం సంస్కృతి రాజకీయాలు కంపుకొడుతున్న ఈ కాలంలో, భారతీయ జనతా పార్టీ కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. పార్టీ అభ్యర్థుల నిబద్ధతను ప్రజల ముందే స్పష్టంగా ప్రకటించేలా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కార్పొరేటర్ అభ్యర్థులతో 'ప్రతిజ్ఞా పర్వం' నిర్వహించడం రాజకీ యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

గత రెండు రోజులుగా కరీంనగర్ నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగులు, ఎన్నికల ప్రచార సభల్లో బీజేపీ అభ్యర్థులతో బండి సంజయ్ ప్రతిజ్ఞ చేయించారు. తొలిరోజు కిసాన్‌నగర్, కాపువాడ–మారుతీనగర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమాల్లో ఐదు డివిజన్ల అభ్యర్థులతో ప్రమాణం చేయించగా, రెండో రోజు కోతిరాంపూర్ చౌరస్తా, పాత లేబర్ అడ్డా వద్ద జరిగిన సభలో 9, 39, 40, 62, 63, 64 డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించడం విశేషం.

ఈ ప్రతిజ్ఞలో ప్రధానంగా గెలిచిన తర్వాత పార్టీని వీడబోనని, భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతానని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని, కరీంనగర్ అభివృద్ధితో పాటు దేశం, సమాజం, ధర్మం కోసం పనిచేస్తానని అభ్యర్థులు దైవ సాక్షిగా, తమ తల్లిదండ్రుల సాక్షిగా ప్రమాణం చేశారు.

ప్రతిజ్ఞా పర్వం ద్వారా పార్టీ పట్ల నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యతను మరింత బలపరచడమే లక్ష్యమని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత పార్టీ మార్పుల రాజకీయాలకు చెక్ పెట్టే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి.

కరీంనగర్ ప్రజల సేవ కే అంకితమని చెప్పే ఈ ప్రతిజ్ఞ, స్థానిక ఎన్నికల ప్రచారంలో కొత్త ఊపును తీసుకొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

RCEP (ASEAN + చైనా, జపాన్, కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) ప్రపంచంలోనే అతిపెద్ద FTA. ఆసియా కేంద్రంగా సరఫరా గొలుసులను బలపరిచింది.








# ఇకనైనా మేల్కోవాలి

- ఉద్యమకారులను ఆదుకోవాలి..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య ఆధ్వర్యంలో వినతి

**ముద్ర, ఖమ్మం:**

తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా విడిచిపెట్టి స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా పెట్టుకొని.., పనిచేసిన తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రెవెన్యూ, గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రం మంగళవారం సమర్పించారు. ముందుగా ఇచ్చిన సమాచారం మేరకే సుమారు వంద మంది తెలంగాణ ఉద్యమకారులు చేతిలో ప్లకార్డులు పట్టుకుని, నెత్తిన గాంధీ టోపీలు పెట్టుకుని.., జై తెలంగాణ నినాదాలతో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి క్రాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఉద్యమకారులను నివారించేందుకు పోలీసులు చూసినప్పటి.., తాము ముందుగా సమాచారం ఇచ్చాకే మంత్రిని కలిసేందుకు వచ్చామని ఉద్యమకారులు బదులు చెప్పారు. అక్కడికి చేరుకున్న మంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. తప్పక ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య మాట్లాడుతూ.. తొలి, మలి దశ ఉద్యమంలో ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే.. పదేళ్లపాటు అధికారంలో ఉన్న ఉద్యమ పార్టీ ఉద్యమకారుల ఆశయాలను తుంగలో తొక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ఉద్యమకారులను కూరలో కరివేపాకు లాగా తీసిపడేసాడని ఆరోపించారు. కెసిఆర్ చెప్పుడు మాటలు విని ఉద్యమకారులను దూరం పెట్టాడని, అదే బాటలో కాంగ్రెస్ పార్టీ కూడా నడవవద్దని మంత్రి పొంగులేటికి బత్తుల విన్నవించారు. రెండేళ్ల క్రితం ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మాటను నిలబెట్టుకోవాలని సోమయ్య కోరారు. గత ఎన్నికల్లో ఉద్యమకారులు ముకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. దీనికి మంత్రి పొంగులేటి స్పందించి అతి త్వరలోనే ఉద్యమకారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిపించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఉద్యమకారులు పనిచేయాలని మంత్రి పొంగులేటి కోరారు. అందుకు ప్రతిగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఉద్యమకారులు, నిరుద్యోగులు, మేధావులు, అమరవీరుల కుటుంబాలు ముకుమ్మడిగా తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని బత్తుల సోమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి కృష్ణ, కుక్క సత్యం, తునికిపాటి చారి, అంగిడి బిక్షం, భువనగిరి నరసింహారావు, రామాంజనేయులు, వడిత్యా రాజేష్ నాయక్, బొలికొండ పాపయ్య, జంపాని అంజయ్య, కుర్రి ముత్తయ్య, కాలింగ్ గురవయ్య, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, ఉల్లోజు వెంకన్న, మీగడ రామారావు, ఉల్లంగి పద్మ, గుమ్మ సీతమ్మ, కలకోట అరుణ, మేర నాగయ్య, కెక్కర్ల శ్రీనివాస్ రావు, కాకర్లమూడి సునీత, గార్ల శేఖర్, గోవిందు, మడికంటి నాగభూషణం, తెగుళ్ల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పాత్ర కీలకమైనది..

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని,ఎన్నికల నియమనిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం భువనగిరి మున్సిపాలిటీ లో పీఓ, ఏపీ ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం లోపాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. పీఓ, ఏపీ ఓ లు ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్, బ్యాలెట్ బాక్స్, ప్రిసైడింగ్ అధికారుల డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంటు, ఏజెంట్ల సమక్షం లోనే బ్యాలెట్ బాక్సులను తెరవడం వంటి అంశా లు వివరించారు. పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామలింగం, పిఓ, ఏ పి ఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండలం బసంతాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పులి దాడిలో మృతి చెందిన లేగ దూడ సంఘటన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాల్లో పులి సంచరిస్తున్నందున పులిని పట్టుకోవడానికి చేసే ప్రయత్నాల పై అటవీ అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటవీ అధికారులు పులిని పట్టుకోవడానికి థర్మల్ డ్రోన్ ను ఉపయోగించి పులి సంచరిస్తున్న ప్రదేశాలను వీడియో తీయడం ,ట్రాప్ కెమెరా, పులిని బంధించడానికి బోన్లు ఏర్పాటు చేశామని అటవీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ప్రత్యేకంగా అడవి ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. రాత్రి వేళలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకలో వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా స్థానిక గ్రామ పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదని అన్నారు. జిల్లా యంత్రాంగం, అటవీ శాఖ సిబ్బంది పులి అడుగు జాడలను గమనిస్తూ, దాని పట్టుకోవడానికి, అడవిలోకి పంపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు భయాందోళన నకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.



# చివరి వరకు ఎదురు చూపులు

- 34 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన, ఒక స్థానం సీపీఐ కి కేటాయింపు

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

కోదాడ మున్సిపాలిటీలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ నాయకులు ఉపసంహరణ సమయం మరో గంటలో ముగుస్తుందనగా ప్రకటించి బీఫారాలు అందజేశారు. దీనితో అభ్యర్థులు హడావుడిగా ఎన్నికల అధికారులకు బీఫారాలు సమర్పించి ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్పార్టీ అభ్యర్థుల జాబితా ... 1వ వార్డు సామినేని ఉమ, 2వ వార్డు రాయపూడి యశోద (సీపీఐ), 3వ వార్డు వంగూరి గోపి, 4వ వార్డు సుల్తానీ సుజాత, 5వ వార్డు బొలిశెట్టి రామయ్య , 6వ వార్డు తుమ్మల నాగేంద్రమ్మ , 7వ వార్డు మాలోతు చైతన్య నాయక్, 8వ వార్డు రామిశెట్టి ఉషశ్రీ, 9వ వార్డు సోమపంగు శోభన్, 10వ వార్డు సంపెట రవి, 11వ వార్డు దేవరపల్లి మల్లేశ్వరి, 12వ వార్డు గుండపునేని పద్మావతి, 13వ వార్డు ముడెం సైదమ్మ, 14వ వార్డు కందుల కోటేశ్వర రావు, 15వ వార్డు షేక్ ఇమామ్ షఫీ, 16వ వార్డు ఖాజా ఎజాజుద్దీన్, 17వ వార్డు యలమందల నర్సయ్య, 18వ వార్డు ఉప్పగండ్ల శ్రీనివాస్, 19వ వార్డు కొల్లా కోటిరెడ్డి, 20వ వార్డు కాళిదాసు వెంకటరత్నం, 21వ వార్డు కట్టెబోయిన జ్యోతి శ్రీను, 22వ వార్డు తూనం కృష్ణ , 23వ వార్డు వాడపల్లి రంగమ్మ , 24వ వార్డు చలపాటి శివకృష్ణ, 25వ వార్డు గుడుగుంట్ల మానస, 26వ వార్డు షేక్ నేహానాజ్, 27వ వార్డు షేక్ షాబుద్దీన్, 28వ వార్డు తోట జ్యోతి, 29వ వార్డు నెమ్మది దేవమణి, 30వ వార్డు కరింగుల ఉమ, 31వ వార్డు ఎర్నేని కుసుమకుమారి, 32వ వార్డు పాశం శ్రీనివాస రావు, 33వ వార్డు పి ఏసుపాదం, 34 వ వార్డు గంధం శ్రావణి, 35వ వార్డు పారా సత్యవతి లకు కేటాయించారు.



### మూడు వార్డులు ఏకగ్రీవం

కోదాడ మున్సిపాలిటీలో 35 వార్డులకు మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి . 11 వ వార్డు నుండి మొత్తం 9 మంది నామినేషన్ దాఖలు చెయ్యగా, నామినేషన్ల ఉపసంహరణ సమయానికి 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని దేవరపల్లి మల్లీశ్వరి ఆ వార్డు కౌన్సిలర్ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక 21 వ వార్డు మొత్తం నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చెయ్యగా మంగళవారం మధ్యాహ్నం సమయానికి ముగ్గురు విరమించుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కట్టబోయిన జ్యోతి కౌన్సిలర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 31 వ వార్డు నుండి మొత్తం 9 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చెయ్యగా మంగళవారం ఉపసంహరణల సమయానికి 8 మంది అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎర్నేని కుసుమ కుమారి ఆ వార్డు కౌన్సిలర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనితో కోదాడ మున్సిపాలిటీలో ముగ్గురు మహిళా కౌన్సిలర్లు బోణీ కొట్టడం విశేషం. ఇందులో ఇద్దరు కౌన్సిలర్లు ఆ పార్టీ నుండి చైర్మన్ రేస్ లో ఉండటం మరింత ఆసక్తిని సంతరించుకుంది.



## 9,10న సీఎం కప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

2వ ఎడిషన్ సీఎం కప్2025 జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక ఈ నెల 9,10 న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ధనుంజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో భువనగిరి టీజీ రెసిడెన్షియల్ స్కూల్ లో అథ్లెటిక్స్, పుట్ బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, క్యారమ్, కరాటే, బ్యాడ్మింటన్, బేస్ బాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, జూడో, కిక్ బాక్సింగ్, నెట్ బాల్, స్విమ్మింగ్, వ్రేజ్లింగ్, ఊషూ క్రీడల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఎంపిక జరుగుతుందన్నారు.

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త....

**ముద్ర ప్రతినిధి, నడిగూడెం:**

ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు నడిగూడెం ఎస్సై అజయ్ కుమార్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపైన, పోలీసు కళా బృందంతో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ కే.నరసింహ ఐపిఎస్ ఆధ్వర్యంలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్ కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి. సైబర్ మోసగాళ్ల వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలుపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు ఫిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే కోదాడ షీ టీం ఫోన్ నెంబర్ 8712686056 కి సమాచారం ఇవ్వాలని చూసించారు. విద్యార్థినులు అందరూ క్రమశిక్షణ కలిగి, తల్లిదండ్రులను గురువులను గౌరవించి, ఉన్నత విద్యను అభ్యసించి, లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. ఆకతాయిలు ఎవరైనా అల్లరి పెడితే వధించినట్లయితే షీ టీం కి సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసు కళ బృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ గురుకుల ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ నరేష్, శ్రీను, కళ్యాణ్ కళా బృందం ఇన్ చార్జ యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి,కృష్ణ, సత్యం, విద్యార్థినులు, కళాశాల, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.





# రోగులకు పండ్ల పంపిణీ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ తరపున కేక్ కట్ చేసి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు తెల్జూరి శ్రీశైలం, రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దాసరి వీరన్న, జిల్లా నాయకులు పసుల రమేష్, రాజా రంగారావు, మాధవరెడ్డి, చక్రపాణి, గజం సత్తయ్య, సురేష్, ప్రకాష్, మల్లేష్, శ్యామలత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## భువనగిరి ఖిల్లాపై బీఆర్ఎస్ జెండా ఎగరాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**



భువనగిరి ఖిల్లాపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ భువనగిరి మున్సిపల్ ఎన్నికల ఇన్ చార్జ్ బండ నరేందర్ రెడ్డి, భువనగిరి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇన్ చార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డిలు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో భువనగిరి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బిఫారాలు అందచేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో భువనగిరి ఖిల్లాపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరూ గతంలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భువనగిరి మున్సిపాలిటీ పై గులాబీ జెండాను ఎగురవేసేందుకు, అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు**

EU–Japan EPA: ప్రపంచ GDPలో పెద్ద వాటాను కవర్ చేసిన ఒప్పందం. ఆటో, అగ్రి, సేవల రంగాల్లో పరస్పర లాభాలు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- **రాష్ట్ర హౌసింగ్ సెక్రెటరీ వీ.పీ. గౌతమ్**



**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని సదాశివపేట, కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలను బట్టి వెంటనే బిల్లులు చెల్లిస్తున్నామని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.
అనంతరం కలెక్టరేట్లో కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల క్షేత్ర స్థాయి పరిస్థితిని మండలాల వారీగా హౌసింగ్ ఎండీకి వివరించారు. జిల్లాకు 12,479 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో 8,081 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, అందులో 6,549 ఇళ్లు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,930 మంది లబ్ధిదారులకు రూ.21 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.
అనంతరం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డీ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకుని అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి సంతృప్తికరంగా ఉందన్నారు. అయితే కొన్ని మండలాల్లో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సుమారు నాలుగు వేల ఇళ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయని, వాటిని మార్చి 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ఏఈలు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మోడల్ హౌస్‌లు పూర్తికాని ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో హౌసింగ్ ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్లను సూపర్ చెక్ చేయాలని, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల్లో సరైన సలహాలు, సూచనలు ఇస్తూ మోటివేట్ చేయాలని సూచించారు. న్యూ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, లబ్ధిదారులకు చూపించి అపోహలను తొలగించాలని తెలిపారు.
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలకు సంబంధించిన అన్ని ఎంబిలు రికార్డు చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు ఇవ్వని ఇళ్లను హౌసింగ్ శాఖకు స్వాధీనం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ ఏజెన్సీలను ఆదేశించారు. రెండు నెలల్లోగా ఫైనల్ స్టేజీలో ఉన్న అన్ని ఇళ్లు పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ జిల్లా పీడీ చలపతిరావు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఎన్నికలపై సమీక్ష

- **పాల్గొన్న ఎస్పీ, ఏఎస్పీ**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా నేపథ్యంలో మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమీక్షించారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు జిల్లాలోని పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికలను పూర్తి శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి స్థాయి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని డీజీపీ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, రిస్క్ ఎలిమెంట్స్‌పై ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ..**
మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లి, ఔరంగాబాద్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్న భద్రతా ఏర్పాట్లపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల పరిధిలో వంద మీటర్ల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదనపు ఎస్పీ వెంట ఎస్సైలు లింగం, సత్యనారాయణ, ఏఎస్సై విఠల్, సిబ్బంది ఉన్నారు.

# మెదక్ లో 31 వార్డులు.. 112 మంది అభ్యర్థులు

- **ఒక వార్డు ఏకగ్రీవం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ మున్సిపాలిటీలో ఒక వార్డు ఏకగ్రీవమైంది. మిగతా 31 వార్డుల్లో 112 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో 31 వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్పో టీ చేస్తుండగా 27 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు, కొన్ని వార్డులో ఎంఐఎం, స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. ఆరు చోట్ల బీఎస్పీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా 3 వార్డుల్లో ఇద్దరు, 13 వార్డుల్లో ముగ్గురు, 10 వార్డుల్లో నలుగురు, 4 వార్డుల్లో అయిదుగురు, ఒక వార్డులో ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

**మానస రెండోసారి ఏకగ్రీవం..**
మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టింది. 32వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గోదల మానస సాయిరాం రెండోసారి ఏకగ్రీవమయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన గోదల జ్యోతి, ఇతరులు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో మానస ఏకగ్రీవమయ్యారు. మానస 2020లో బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మానస వరుసగా రెండుసార్లు ఏకగ్రీవం కావడం విశేషం.



# క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు.
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తోన్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే క్యాన్సర్ ను ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.
ఈ సందర్భంగా వైద్య నిపుణులు, అధ్యాపకులు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు, ప్రారంభ దశలో గుర్తింపు ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం, పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు.
క్యాన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం, మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. క్యాన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు, భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన, సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు, సమాచార పత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు క్యాన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, తదితర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.




జానో జాగో సంఘం రాష్ట్ర ప్రధాన

# కార్యదర్శిగా అబ్దుల్ రహీం

- **జిల్లా అధ్యక్షుడిగా యూసూఫ్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
జానో జాగో (ముస్లింల అభివృద్ధి వేదిక) సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ అబ్దుల్ రహీం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా మొహమ్మద్ యూసూఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు జానో జాగో సంఘం జాతీయ అధ్యక్షుడు సయ్యద్ నిసార్ అహ్మద్, జాతీయ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ హుస్సేన్, రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా తంజీలూర్ రహమాన్ నోమానీలు మొహమ్మద్ అబ్దుల్ రహీం, మొహమ్మద్ యూసూఫ్ లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ నిసార్ అహ్మద్, మొహమ్మద్ హుస్సేన్, మౌలానా తంజీలూర్ రహమాన్ నోమానీ మాట్లాడుతూ మత రాజకీయాలు మాకొద్దు, అభివృద్ధి ఫలాలు మాకు కావాలి అన్న నినాదంతో ముస్లింల రాజకీయ, ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రతి ఒక్క జానో జాగో సంఘం నేత, కార్యకర్త పనిచేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ముస్లిం గడపకు జానో జాగో సంఘం తీసుకెళ్లి తమ వారిని చైతన్యం చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర మైనార్టీ వర్గాలతో కలసి బడుగుల రాజ్యాధికారం సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. మొహమ్మద్ అబ్దుల్ రహీ, మొహమ్మద్ యూసూఫ్ మాట్లాడుతూ తమకు ఇచ్చిన ఈ పదవిని తాము ఓ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ముస్లిం సమాజాన్ని చైతన్యం చేసి ఇతర బడుగు, బలహీన వర్గాలతో మమేకమై బడుగుల రాజ్యాధికారం కోసం ప్రయత్నం చేస్తామని వారు ప్రతీనబూనారు. ఈ కార్యక్రమంలో జానో జాగో సంఘం నేతలు మొహమ్మద్ ఖాసీ, మొహమ్మద్ సుభాన్ అలీ తదితర నేతలు పాల్గొన్నారు.



# ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **ఎన్నికల నియామవళిని ఉల్లంగిస్తే కఠిన చర్యలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ఎన్నికల నియామవళిని ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సాధారణ ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలోని వెస్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా జరుగాలని సూచించారు. అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేసినా, బెదిరించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సంఘం నియమాలను అనుసరించి గుర్తులను కేటాయించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కుల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించారు. ల్యాబ్ మెటీరియల్ పరిశీలించి, ప్రాక్టికల్స్ ఏ విధంగా జరుగుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రికార్డులు, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు స్పెషల్ క్లాసులకు హాజరు కావాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఇంటర్ విద్యాధికారి మాధవి, చీఫ్ సూపరెంటెండెంట్ నవీన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



# జర భద్రం..

- **వీరి మాటలు నమ్మారో నిలువునా మునుగుతారు..!**

నిజామాబాద్ జిల్లాలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఇంట్లో లంకె బిందెల పేరుతో మహిళ నుంచి ఓ వ్యక్తి రూ.8 లక్షలకు పైగా వసూలు చేశాడు. ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని.. వాటిని బయటకు తీయకపోతే ఎవరో ఒకరు చనిపోతారని నమ్మించి డబ్బు వసూలు చేశాడు. ఆ తర్వాత పూజలు చేయకుండా తప్పించుకుంటూ తిరుగుతుండగా.. బాధితురాలు మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అరెస్టు చేశారు.
తాజాగా.. నిజామాబాద్ జిల్లాలో ఓ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. 'మీ ఇంట్లో లంకె బిందెలున్నాయి.. వాటిని బయటకు తీయకపోతే ప్రాణనష్టం సంభవిస్తుంది' అని ఇంట్లో వాళ్లను భయభ్రాంతులకు గురిచేసి ఓ వ్యక్తి రూ.లక్షల్లో దోచుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొన్నాజిపేట్ గ్రామానికి చెందిన ఓ మహిళ వద్దకు గత జనవరి 26న ఒక వ్యక్తి వచ్చాడు. ఆమెతో మాటలు కలిపి మీ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మించాడు
వాటిని బయటకు తీయకపోతే ఇంట్లోని ఒకరు మరణిస్తారని భయపెట్టాడు. వాటిని బయటకు తీయాలంటే పెద్ద పెద్ద పూజలు చేయాలని నమ్మించాడు. అందుకు ఆమె నుంచి పలు ధపాలుగా రూ.8.20 లక్షల వరకు వసూలు చేశాడు. డబ్బు ముట్టజెప్పిన తర్వాత పూజులు చేయకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఫోన్ చేసినా స్పందించటం లేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితురాలు కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మహిళను మోసగించిన నిందితుడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన కడమంచి నర్సింలుగా గుర్తించారు. ఈ మేరకు నర్సింలును సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



నర్సింలు నేర చరిత్ర గురించి ఆరా తీసిన పోలీసులు.. అతడు మరో ఇద్దరితో కలిసి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ ముఠా గతంలో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోనూ ఇదే విధంగా లంకె బిందెలను బయటకు తీస్తామని చెప్పి ఓ మహిళతో రూ.14 లక్షల బేరం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్ కింద రూ.2.93 లక్షలు తీసుకున్నారని పోలీసులు తెలిపారు. సదాశివనగర్ మండలం, జనగామ జిల్లా కొడకండ్ల పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇలాగే లంక బిందెల పేరుతో మోసాలకు పాల్పడినట్లు వివరించారు. నిందితుడి నుంచి రూ.7 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రస్తుతం మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారి కోసం గాలిస్తున్నామన్నారు. ఇలాంటి వాళ్ల మాటలు నమ్మకూడదని.. నమ్మితే నిలువునా మునుగుతారని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
EU–South Korea FTA: యూరోప్‌కు ఆసియాలో గేట్వేగా మారిన ఒప్పందం. ఎగుమతుల పెరుగుదలకు స్పష్టమైన ఉదాహరణ.

# మోదీ చాణక్యం.. దిగొచ్చిన ట్రంప్

ముద్ర న్యూస్:

మాయల్లేవు. మంత్రాల్లేవు. కేవలం వ్యూహమే. అదరలేదు. బెదరలేదు. వ్యూహాత్మక అడుగులు వేశారంతే. వెంటనే ట్రంప్ కు వాస్తవం బోధపడింది. దీంతో ఇండియాతో టారిఫ్ వార్ కు ఎండ్ కార్డ్ పడింది. మోదీ అనుసరించిన వ్యూహమే భారత ఎగుమతులపై టారిఫ్ లు 50 శాతం నుంచి 18 శాతానికి దిగిరావడానికి కారణం. 500 శాతం విధిస్తామని బెదిరించిన ట్రంప్ ను 18 శాతానికి తీసుకొచ్చారంటే.. దాని వెనుక ఉన్నది సమయస్ఫూర్తితో వ్యవహరించడం, అవకాశాలను అనుకూలంగా మలుచుకోడం. ఫలితంగానే ఇండియా యూఎస్ మధ్య ఉన్న టారిఫ్ వార్ కు ముగింపు పడింది. లేదంటే ఎడతెగని వ్యవహారంగా మారేది.





**ట్రంప్ వార్నింగ్..**

రష్యా నుంచి ఆయిల్ కొనొద్దని అమెరికా ఒత్తిడి చేసింది. కాని భారత్ వెంటనే తగ్గలేదు. కొనుగోలు చేసింది. ట్రంప్ ఆంక్షలు విధించారు. 50 శాతం టారిఫ్ విధించారు. అయినా భారత్ వెనకడుగు వేయలేదు. పరిస్థితులను అంచనా వేసింది. పరిణామాలను ఊహించింది. సమయస్ఫూర్తితో వ్యవహరించింది. అమెరికా మనకెంత అవసరమో. అమెరికాకు మనం అవసరం అంతే ఉంది. అందుకే వ్యూహాత్మకంగా పావులు కదిపింది. అమెరికాపై పూర్తిగా ఆధారపడకూడదని నిర్ణయం తీసుకుంది. మార్కెట్ రిస్క్ ను తగ్గించుకునే విధంగా డైవర్సిఫై చేయడం మొదలుపెట్టింది. కొత్త మార్కెట్ల అన్వేషణ మొదలుపెట్టింది. యూరోపియన్ యూనియన్ తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. ఇది రెండు దేశాల దీర్ఘకాల అభివృద్ధికి చాలా కీలకం. దీంతో అమెరికాకు వాస్తవం బోధపడింది. అప్పుడు కూడా అమెరికా సైలెంట్ కాలేదు. ఇండియాతో ఈయూ డీల్ అంటే.. పరోక్షంగా రష్యాకు యుద్ధ వనరులు సమకూర్చడమే అని హెచ్చరించింది. ఈయూ కూడా అమెరికాను లెక్కచేయలేదు. అదే సయమంలో గ్రీన్ ల్యాండ్ విషయంలో అమెరికా తీరును తప్పుపట్టింది. ట్రంప్ వ్యవహార శైలితోనే ఈయూ, భారత్ మధ్య ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ తొందరగా కుదిరిందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**అమెరికాకే నష్టం..**

ఇండియాపై టారిఫ్ లు విధించడం ద్వారా అమెరికాకే నష్టం. ఎందుకంటే భారత్ ఎగుమతులకు అమెరికా మార్కెట్ ఎంత అవసరమో.. అమెరికాకు ఎగుమతులకు సైతం భారత మార్కెట్ అంతే అవసరం. ప్రపంచంలో జనాభాలో రెండో స్థానంలో ఉన్న భారత మార్కెట్ లేకపోతే అమెరికా ఉత్పత్తులు అమ్ముడుపోవు. అదే విధంగా టెక్నాలజీ రంగంలో అమెరికా ఆధిపత్యం చెలాయించడానికి భారత నిపుణులే మూలాధారం. వీరు లేకుండా టెక్నాలజీ రంగంలో అమెరికా ముందుకు వెళ్లలేదు. ఆవిష్కరణలు సాధ్యం కావు. కాబట్టి ఎలా చూసినా మనలాగే అమెరికాకు అవసరాలు ఉన్నాయి. వీటిని అంచనా వేసుకుని ఇండియా ఈయూతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుంది. తద్వార కొత్త మార్కెట్ ద్వారాలు తెరుచుకున్నాయి. మరికొన్ని దేశాలతో కూడా ఇండియా చర్చలు జరుపుతోంది. దీంతో అమెరికాపై పూర్తి స్థాయిలో ఆధారపడాల్సిన పనిలేదు. ఇది ట్రంప్ కు అర్థమైంది. అందుకే టారిఫ్ లు తగ్గించారు.

**వెంటనే తగ్గలేదు..**

రష్యాతో ఆయిల్ కొనొద్దని ట్రంప్ ఒత్తిడి తెచ్చినా ఇండియా వెంటనే తగ్గలేదు. టారిఫ్ ప్రభావాన్ని భరిస్తూనే చర్చలు జరిపింది. మరోవైపు నూతన మార్కెట్లను అన్వేషించింది. క్రమంగా రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించింది. అమెరికాతో ముడిపడి ఉన్న దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించింది. ఫలితంగా ట్రంప్ దిగొచ్చారు. ఇండియా రష్యా ఆయిల్ కొనుగోలు ఆపడంతో ట్రంప్ అనుకున్నది జరిగింది. దీంతో రెండు దేశాల మధ్య జరుగుతున్న టారిఫ్ వార్ కు ముగింపు కార్డ్ పడింది.

# మోదీ భయపడ్డారు.. దేశాన్ని అమ్మేశారు



- ట్రేడ్ డీల్పై రాహుల్ గాంధీ వ్యాఖ్య

ముద్ర న్యూస్:

ప్రధాని మోదీపై లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడుతుండగా స్పీకర్ అభ్యంతరంపై బయటకు వచ్చిన రాహుల్ పార్లమెంటు ఆవరణలో విమర్శల తూటాలు పేల్చారు. ప్రధానిపై రెండు రకాల ఒత్తిళ్లున్నాయి.. మోదీ భయపడ్డారు. దేశాన్ని తాకట్టు పెట్టారు.. అంటూ ఇండియా–అమెరికా ట్రేడ్ డీల్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కాంప్రమైజ్ అయ్యారని, తీవ్రమైన ఒత్తిడిలో సంతకాలు చేశారని తెలిపారు. ప్రస్తుతం తన ఇమేజ్ డ్యామేజ్ అవుతుందనే భయంలో ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. కొన్ని నెలలుగా పెండింగ్ లో ఉన్న ట్రేడ్ డీల్ పై అత్యంత ఒత్తిడిలో సంతకాలు చేశారు. నరేంద్ర మోదీ ఇమేజ్ డ్యామేజ్ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతకు ముందు పార్లమెంటులో ఆర్మీ మాజీ చీఫ్ నరవనే ఆర్టికల్ పై మాట్లాడేందుకు ప్రయత్నం కొనసాగించారు. చైనా దురాక్రమణ, భారత్ వైఖరిపై ఉన్న ఆర్టికల్ పై మాట్లాడేందుకు స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేయడం.. రాహుల్ మాట్లాడే ప్రయత్నం చేయడంతో లోక్ సభలో గందరగోళం ఏర్పడింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య యుద్ధ వాతావరణంతో మైక్ కట్ చేయడంతో బయటికి వచ్చిన రాహుల్.. మీడియా పాయింట్ దగ్గర తీవ్ర విమర్శలకు దిగారు. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏంటంటే మోదీ కాంప్రమైజ్ అయ్యారు. దేశ ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. ప్రజలు దీనిగురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. మొదటి సారి రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేతను అనుమతించలేదు. ఇన్నాళ్లుగా ఎవరైతే ప్రధాని మోదీ ఇమేజ్ క్రియేట్ చేశారో వాళ్ల కారణంగానే మోదీ కాంప్రమైజ్ కావాల్సి వచ్చింది. ప్రజల కష్టాన్ని, దేశాన్ని అమెరికాకు అమ్ముకున్నారు.. అంటూ విమర్శలకు దిగారు.

**అదానీపై అమెరికాలో కేసు..**

మోదీ మిత్రుడు అదానీపై అమెరికాలో కేసు ఉంది. అంటే మోదీపైన కేసు ఉన్నట్లు. ఇప్పటి వరకు అమెరికా విడుదల చేయని చాలా సీక్రెట్ అంశాలు ఎప్స్టెన్ ఫైల్స్ (The Epstein Files) లో ఉన్నాయి. దీని కారణంగా మోదీ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ రెండు ఒత్తిడుల కారణంగా మోదీ దేశాన్ని తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఇది దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

# భువనేశ్వర్‌కు వెళ్లిన పీఐబీ బృందం





- 6 వరకు కొనసాగనున్న హైదరాబాద్ మీడియా ప్రతినిధుల పర్యటన

ముద్ర, హైదరాబాద్:

హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం సోమవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఐదు రోజుల పర్యటనను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కీలక అభివృద్ధి పథకాలపై మీడియా బృందానికి అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక, వారసత్వ ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.ఈ బృందానికి పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ అఖిల్ కుమార్ మిశ్రా, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. మొదటి రోజు భువనేశ్వర్‌లోని పీఐబీ కార్యాలయాన్ని ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏడీజీ అఖిల్ కుమార్ మిశ్రా ఒడిశాలోని మీడియా రంగం.. పీఐబీ, సీబీసీ చేపడుతున్న వివిధ ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు.రెండో రోజు మీడియా బృందం సీఎస్ఐఆర్‌కు చెందిన మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌ను (సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ) సందర్శించింది. సంస్థ చేపడుతున్న పరిశోధనలు, ప్రయోగశాల సౌకర్యాలు, ఖనిజ పదార్థ సాంకేతిక రంగాలలో అందిస్తున్న సహకారం గురించి అక్కడి శాస్త్రవేత్తలు మీడియా ప్రతినిధులకు వివరించారు.ప్రధాన శాస్త్రవేత్త కాళీ సంజయ్ మాట్లాడుతూ కీలకమైన ఖనిజాల రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం విధానపరమైన, వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కృషిలో సీఎస్ఐఆర్ఐఎంఎంటీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఒడిశా కళలు, సంస్కృతి, హస్తకళల గురించి తెలుసుకోవడానికి మీడియా బృందం 'కళా భూమి' మ్యూజియాన్ని సందర్శించింది.

ఈ నెల 6 వరకు కొనసాగనున్న పర్యటనలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను ఈ మీడియా ప్రతినిధుల బృందం సందర్శించనుంది.

# జగిత్యాలలో కాంగ్రెస్‌కు సెగ తప్పదు..



ముద్ర న్యూస్:

జగిత్యాల రాజకీయాల్లో గందరగోళం కొత్తేమీ కాదు. కానీ కాంగ్రెస్ పార్టీలో మాత్రం రచ్చ రచ్చగా మారడం ఇప్పుడు ఆనవాయితీగా మారింది. రాజకీయ పరిస్థితి ఏదైనా, నాయకత్వం ఎవరైనా, జగిత్యాల కాంగ్రెస్‌లో అంతర్గత పోరు తప్పదన్న భావన పార్టీ శ్రేణుల్లోనే బలంగా ఉంది.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచే ఈ ఆధిపత్య పోరు మొదలైంది. 'జగిత్యాల అంటే తన అడ్డా' అన్న భావనతో ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి... ఎమ్మెల్యే సంజయ్ రాజకీయ ప్రవేశాన్ని మొదటి నుంచే వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న ఉద్రిక్తత మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీతో పరాకాష్టకు చేరింది.

**టికెట్లే టార్గెట్,, వర్గాలే యుద్ధం**

జగిత్యాల మున్సిపాలిటీలోని 50 వార్డుల్లో మెజారిటీ స్థానాలు తన అనుచరులకే దక్కాలని జీవన్ రెడ్డి పట్టుబట్టారు. కానీ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం తీసుకున్న నిర్ణయం ఆయనకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. సంజయ్ వర్గానికి 30 టికెట్లు, జీవన్ రెడ్డి వర్గానికి 20 టికెట్లు కేటాయించడంతో కాంగ్రెస్‌లో అసలు రాజకీయ యుద్ధమే మొదలైంది. తన వర్గానికి కేవలం 20 సీట్లే ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుచరులు ఎమ్మెల్యే సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని రోడ్డుపై నిరసనలు, సోషల్ మీడియాలో ఘాటు విమర్శలు చేస్తూ పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారాయి.

**కమలం పార్టీకి కలిసొచ్చే చీలిక..**

కాంగ్రెస్‌లో నెలకొన్న ఈ అంతర్గత కుమ్ములాటను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గతంలో మున్సిపల్ చైర్మన్ పీఠంపై అవిశ్వాసం, రాజకీయ సమీకరణాల్లో వచ్చిన మార్పులతో జగిత్యాల పట్టణంలో బీజేపీ ఇప్పటికే బలపడింది. ఇప్పుడు అధికార పార్టీలోని ఈ చీలికను ఆసరాగా చేసుకుని, అసంతృప్త నేతలను తమ వైపుకు తిప్పుకోవాలనే యత్నంలో కమలం పార్టీ నేతలు ఉత్సాహంగా ఉన్నారు. కాంగ్రెస్‌లోని అంతర్గత పోరు ఎంత ఎక్కువైతే, బీజేపీకి అంత రాజకీయ లాభమన్న లెక్కలతో పావులు కదుపుతున్నారు.

**చైర్మన్ పీఠమే అసలు పరీక్ష..**

ఒకవేళ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ కౌన్సిలర్లను గెలుచుకున్నా అసలు పరీక్ష చైర్మన్ ఎన్నిక సమయంలోనే ఎదురవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యే వర్గం చైర్మన్ పీఠం కోసం ప్రయత్నిస్తే, జీవన్ రెడ్డి వర్గం దాన్ని అడ్డుకునే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అప్పుడు కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదిరే ప్రమాదం ఉంది.

**సెగ తగ్గేదెప్పుడు..?**

ఇలా చూస్తే, జగిత్యాల కాంగ్రెస్‌కు రాజకీయ సెగ ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఆధిపత్య పోరు, అసంతృప్తులు, వర్గ విభేదాలు - ఇవన్నీ కలిసొచ్చి పార్టీకి గట్టి పరీక్షగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో ప్రశాంతత నెలకొంటేనే అది విశేషమన్న వ్యాఖ్య రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మొత్తానికి జగిత్యాల కాంగ్రెస్‌లో రచ్చ లేకపోతేనే ఆశ్చర్యం!

# మెటాపై సుప్రీం ఆగ్రహం

- ప్రైవసీని పట్టించుకోరా..
- చట్టాలను పాటించకపోతే దేశం నుంచి వెళ్లిపోండి
- అత్యున్నత న్యాయస్థానం హెచ్చరిక

ముద్ర న్యూస్:




ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ మెటాను హెచ్చరించారు. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయని తెలిపారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.

**ఏమిటీ ప్రైవసీ పాలసీ..**

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీ తీసుకొచ్చింది. దీని ప్రకారం యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు**

Australia–China FTA (ChAFTA): ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆస్ట్రేలియాకు లాభం. చైనాకు స్థిర సరఫరా భరోసా.



# సమయానికి అందని కాంగ్రెస్ బి ఫామ్ లు

- **ఇద్దరు అభ్యర్థులకు చేజారిన పార్టీ సింబల్**

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్ అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల అధికారులకు సమయానికి బీఫాంలు అందజేయక పోవడంతో ఆ పార్టీలో తీవ్ర కలవ రాన్ని రేపింది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తయి ఉపసంహరణల గడువు ముగిసి పార్టీ అభ్యర్థులు బీఫారాలను అధికారులకు నిర్ణీత సమయంలోగా అందజేయాల్సి ఉంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఆయా పార్టీల నుంచి బిఫారాలను పొంది అధికారులకు మంగళవారం మధ్యాహ్నా మూడు గంటల వరకే అందజేశారు. అందులో భాగంగానే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి నేతృత్వంలో రెండు రోజులుగా అభ్యర్థులకు బీఫామ్ ఇచ్చే కార్యక్రమంలో తర్జనభర్జనలు కొనసాగుతూ వచ్చాయి. పార్టీ అభ్యర్థులుగా నిర్ణయించిన వారికి బీఫాములను స్థానిక కేడిఆర్ నగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫాములు ఇచ్చే ప్రక్రియను చేపట్టారు. దాదాపు 31 మంది అభ్యర్థులు నిర్ణీత సమయంలోనే అధికారులకు బీఫారాలు అందజేశారు.కానీ ఏడో వార్డు, 25 వ వార్డు కు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ నిలిపేందుకు ఇద్దరు అధికార పార్టీ అభ్యర్థులకు కొద్ది నిమిషాల ముందే కార్యాలయంలో బీఫారాలు అందజేయగా వాటిని తీసుకొని మున్సిపల్ ఎన్నికల కార్యాలయానికి వచ్చేలోపే సమయం మించి పోవడంతో అధికారులు గేట్లు వేసేశారు. దీంతో ఆ ఇద్దరు అభ్యర్థులు బీఫాములు అందించకుండానే వెనుతిరిగాల్సిన పరిస్థితి ఎదురైంది . మున్సిపాలిటీలోని ఏడవ వార్డు జనరల్ మహిళకు కేటాయించగా 25వ వార్డు బీసీ జనరల్ కు రిజర్వ్ చేశారు. ఆయా వార్డుల నుంచి ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎవరికి టికెట్ ఇవ్వాలన్నదానిపై చర్చలు, తర్జనభర్జనుల అనంతరం ఏడో వార్డుకు నక్క రాములు భార్య సుజాతకు, 25 వ వార్డు కార్యకర్త కదిరి రాములకు కేటాయించి బీఫాములు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు అందజేశారు. బీఫారాలను తీసుకొని మున్సిపల్ కార్యాలయానికి వచ్చేలోపే సమయం ముగియడంతో చేసేది లేకుండా పోయింది. మున్సిపాలిటీలో ప్రధానంగా కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న తరుణంలో అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించి ముందు వరుసలో ఉండాల్సి ఉండగా టికెట్లు కేటాయింపులో నాన్చుడు ధోరణి అవలంబించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీకి రెండు వార్డుల్లో హస్తం గుర్తుతో ఓట్లు వేసే పరిస్థితి లేకుండా పోవడానికి కారకులు ఎవరనే దానిపై పట్టణంలో చర్చ సాగుతున్నది.

# తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో..

- **నిరుద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం**
- **రెండేళ్లయినా అందని 2 లక్షల ఉద్యోగాలు..**
- **ఉద్యోగాలు భర్తీపై సీఎం రేవంత్ ముఖం చాటేయడం నిస్సిగ్గు చర్య**
- **మాట తప్పిన సీఎం.. ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సిగ్గుగా తప్పించుకుంటోందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పడంపై తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని హెచ్చరించారు. రెండేళ్లు గడిచినా ఒక్క హామీని అమలు చేయలేకపోవడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

**బీఆర్ఎస్ హయాంలో లక్షా అరవై ఐదు వేల ఉద్యోగాలు..**

కేసీఆర్ పాలనలో ఇప్పటికే లక్షా అరవై ఐదు వేల ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. చివరి దశలో ఉన్న అరవై ఐదు వేల నియామక పత్రాలు అందించి ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ముఖ్యమంత్రి, ఆ తరువాత మొత్తం నియామక ప్రక్రియకే చేతులెత్తేయడంతో తెలంగాణలో పరిస్థితి "నియామకాలు శూన్యం"గా మారిందని విమర్శించారు. పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని పాలనగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందన్నారు.

**గ్యారెంటీలన్నీ గారడీలే..**

ఉద్యోగాల హామీతో పాటు ఆరు గ్యారెంటీలన్నీ ప్రజలను మభ్యపెట్టే గారడీలేనని కేటీఆర్ మండిపడ్డారు. రైతుబంధు పేరుతో రైతులను మోసం చేయడం, మహిళలకు నెలకు రెండు వేల ఐదు వందలు ఇస్తామని చెప్పి రెండేళ్లయినా అమలు చేయకపోవడం కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందన్నారు. నిరుద్యోగ భృతి, మెగా ఉపాధ్యాయ నియామకాల పేరుతో చేసిన ద్రోహానికి తెలంగాణ సమాజం తప్పకుండా గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

**నిరుద్యోగుల ఉసురు తప్పదు..**

నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా ప్రజలు క్షమించరని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు ప్రతి నిరుద్యోగి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా సంఘటితంగా నిలబడతాడన్నారు. తెలంగాణ యువత పిడికిళ్ల బలం ఏంటో, కాంగ్రెస్ పునాదులు ఎలా కదలిపోతాయో త్వరలోనే చూపిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

**రెండేళ్లయినా అందని రెండు లక్షల ఉద్యోగాలు..**

అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల నియామకాలు చేపడతామని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అంటూ మాట మార్చడం యువతను మోసం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీ నుంచి వచ్చి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే నియామకాలు చేయాలని చెప్పిన ప్రియాంక గాంధీ మాటలను కూడా కాంగ్రెస్ విస్మరించిందన్నారు. ఆ మాట అమలై ఉంటే ఈ దగాకోరు ప్రభుత్వం ఇప్పటికే కూలిపోయేదని వ్యాఖ్యానించారు.

# భారీ లేఆఫ్స్



- **30 వేల వరకు ఉద్యోగాల కోతకు సిద్ధమవుతున్న ఒరాకిల్?**

**ముద్ర, బిజినెస్ న్యూస్ :**

సాంకేతిక ప్రపంచం ప్రస్తుతం ఒక విచిత్రమైన సంధి కాలంలో ఉంది. ఒకవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టించబోయే అద్భుతాల గురించి ఊహల్లో తేలుతుంటే.. మరోవైపు అదే ఏఐ తెస్తున్న ఖర్చులు.. మారుతున్న ఆర్థిక సమీకరణలు వేల సంఖ్యలో ఉద్యోగాలను బలి తీసుకుంటున్నాయి. తాజాగా ప్రముఖ టెక్ దిగ్గజం ఒరాకిల్ 2026 నాటికి సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించనుందనే వార్త ఈ చేదు నిజానికి అద్దం పడుతోంది.

**- ఖరీదైన 'ఏఐ' కల**

ఏఐ రంగంలో అగ్రగామిగా నిలవాలంటే కేవలం సాఫ్ట్‌వేర్ ఉంటే సరిపోదు.. దానికి వెన్నుముక లాంటి డేటా సెంటర్లు, అత్యాధునిక చిప్‌లు, అపారమైన విద్యుత్ అవసరం. ఒరాకిల్ గత కొంతకాలంగా ఈ మౌలిక సదుపాయాల కోసం భారీగా పెట్టుబడులు పెట్టింది. అయితే ఊహించిన దానికంటే నిర్మాణం... చిప్‌ల ఖర్చులు పెరగడం, వడ్డీ రేట్లు భారమవ్వడం వల్ల కంపెనీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**- బ్యాంకుల వెనకడుగు.. ఆర్థిక ఒత్తిడి**

సాధారణంగా టెక్ ప్రాజెక్టులకు వెన్నుదన్నుగా నిలిచే అమెరికా బ్యాంకులు.. ఖరీదైన ఏఐ డేటా సెంటర్ల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. నిధుల లభ్యత తగ్గడంతో ఒరాకిల్ వంటి సంస్థలు తమ స్వయంశక్తిపై ఆధారపడక తప్పడం లేదు. ఫలితంగా $8 నుంచి $10 బిలియన్ల నగదు నిల్వలను సమకూర్చుకోవడం కోసం ఉద్యోగ కోతలు అనే కఠిన నిర్ణయానికి కంపెనీ సిద్ధమవుతోంది.

**మానవ వనరుల కంటే మౌలిక వసతులకే ప్రాధాన్యమా?**

క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్ ఆపరేషన్లలో కోతలు విధిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎందుకంటే ఇవి కంపెనీ వృద్ధికి కీలకమైన విభాగాలు. అయినప్పటికీ "తక్కువ మందితో ఎక్కువ సామర్థ్యం" అనే సూత్రాన్ని పాటిస్తూ టెక్నాలజీ ద్వారానే పనులను చక్కబెట్టాలని సంస్థ భావిస్తోంది. ఇది కేవలం ఒరాకిల్ సమస్య మాత్రమే కాదు.. మొత్తం టెక్ రంగంలోని ధోరణిని సూచిస్తోంది.

**పాఠం ఏమిటి?**

ఏఐ యుగంలో ఉద్యోగం సాధించడం కంటే ఉన్న ఉద్యోగాన్ని నిలుపుకోవడం పెద్ద సవాలుగా మారింది. కంపెనీలు లాభాల్లో ఉన్నప్పటికీ భవిష్యత్తు అవసరాల కోసం వర్క్‌ఫోర్స్‌ను తగ్గించుకోవడం ఆందోళనకరం. ఏఐ అనేది ఉద్యోగాలను సృష్టించే ఇంజిన్ కావాలా లేక ఖర్చులను తగ్గించే కత్తెర కావాలా అన్నది ఇప్పుడు చర్చనీయాంశం. ఒరాకిల్ అధికారికంగా ఈ వార్తను ధృవీకరిస్తే అది టెక్ రంగంలో మరో భారీ వలసకు దారితీయవచ్చు. ఏది ఏమైనా టెక్ నిపుణులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవడమే ఈ అనిశ్చితికి ఏకైక పరిష్కారం.

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా :**

కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆలేరు మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. రెండేళ్ల పాలనలో ఒక్క పైసా పనికీ రాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలేరు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసిన ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, ఆలేరు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫారాల పంపిణీ

**ముద్ర, మేడ్చల్ :**

మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మంగళవారం బీఫారాలు పంపిణీ చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఈ ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అవసరం

- **రాష్ట్రానికి రావాల్సిన నిధులపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి**
- **ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**ముద్ర న్యూస్ :**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**కేంద్ర ప్రాయోజిత పథకాలపై దృష్టి..**

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి గరిష్ట నిధులు పొందేలా శాఖలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఐదు లక్షల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. ఇందులో దేశ జనాభాలో సుమారు 15శాతం ఉన్న తెలంగాణ రాష్ట్రానికి కనీసం 25 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని స్పష్టం చేశారు.

**ఫార్మా, సెమీకండక్టర్, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం**

కేంద్ర బడ్జెట్‌లో ఔషధ పరిశ్రమ, రంగాభివృద్ధి, అర్ధచాలక (సెమీకండక్టర్) తయారీ, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో ఆయా రంగాల్లో రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలను అనుసంధానిస్తూ దేవాలయ మార్గం (టెంపుల్ కారిడార్) అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు.

**పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధికి విస్తృత అవకాశం..**

వరంగల్‌లో మామునూరు విమానాశ్రయం అభివృద్ధి నేపథ్యంలో ఈ జిల్లాల్లో పర్యాటక, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు ప్రమాణాలు పదహారవ ఆర్థిక సంఘం కింద 2011 జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు ఉంటుందని, అలాగే జనాభా నిర్మాణం, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం వంటి అంశాల ఆధారంగా కూడా నిధులు కేటాయిస్తారని తెలిపారు. ముఖ్యంగా అభివృద్ధి ఆధారిత సూచికల ప్రకారం నిధుల పంపిణీకి ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా మిగిలిపోయిన నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వి. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్‌రంజన్, సవ్యసాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కోర్టుపై భారత్ ఆగ్రహం!



**ముద్ర న్యూస్ :**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై భారత్ చర్యలకు దిగింది. ఇందులో భాగంగా 1969నాటి సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో పాకిస్తాన్‌కు నీటి సరఫరా నిలిపివేసింది. సింధూ నదిపై కొత్తగా ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్‌లో పంటలు ఎండుతున్నాయి. కరువు ఛాయలు అలుముకున్నాయి. సింధూ జలాలు ఇవ్వకపోతే రక్తం పారిస్తామని బెదిరించింది. కానీ భారత్ భయపడలేదు. దీంతో నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు భారత్‌ను వివరాలు కోరింది. కోర్టు ఆదేశాలను భారత్ స్పష్టంగా తిరస్కరించింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల 'పాండేజ్ లాగ్‌బుక్'లు సమర్పించాలని కోరినా, భారత్ దాన్ని పాటించే ప్రసక్తి లేదని ప్రకటించింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పీస్ ప్యాలెస్‌లో జరిగిన విచారణకు భారత్ దూరంగా ఉంది.

**మధ్యవర్తిత్వం అక్రమం..**

భారత్ పేర్కొన్న ముఖ్య అంశం, సీవోఏ ఏర్పాటు చట్టవిరుద్ధం. దానికి ఎటువంటి చట్టబద్ధత లేదని కొట్టిపారేసింది. 2025 ఏప్రిల్ 23న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఈ ప్రతిష్టంభన. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరుల మరణానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఆరోపించి ఈ నిర్ణయం తీసుకుంది.

**అంతర్జాతీయ ఒత్తిడికి పాకిస్తాన్ వ్యూహం..**

**భారత్ పాల్గొనకపోయినా, కోర్టు పాక్ విన్నపాన్ని ఆధారంగా విచారణ కొనసాగిస్తోంది. సమాచారం ఇవ్వకపోతే ప్రతికూల ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించింది. భారత్ ఇది ఏకపక్షీయమని, యథార్థాలను విస్మరించినదని వాదిస్తోంది. ఈ ప్రతిష్టంభన సింధు వివాదాన్ని నీటి పంపకాలకు మించి భారత–పాక్ దౌత్య యుద్ధంగా మార్చింది. భారత్ గట్టి నిలబడటం పాక్ ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది. భారతం లేని విచారణలు చట్టపరంగా బలహీనమే అవుతాయి.**

**ఉగ్రవాదానికి నీటి సహకారం ఇవ్వం..**

సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పాకిస్తాన్‌కు నీటి సరఫరా చేయలేనని భారత్ గట్టిగా చెప్పింది. ఒప్పందం తాత్కాలికంగా పక్కనపెట్టినందున అంతర్జాతీయ వేదికలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాక్ వ్యవసాయం సింధు నదులపై ఆధారపడుతుండటంతో తర్బేలా, మంగ్లా జలాశయాల్లో నీరు ప్రమాద స్థాయిలో ఉంది.



# వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

**ముద్ర, నారాయణపేట :**

పట్టణంలోని పేట 2, 3వ వార్డుల్లో టీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మంగళవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను కోరారు. గత బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు సుతారి అరుణ రాంరెడ్డి, కాకర్ల నారాయణమ్మలకు మద్దతుగా నిలిచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మీ ఇంటి బిడ్డలుగా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. మళ్లీ టీఆర్ఎస్ అధికారంలోకి రాబోతోందని ఓటర్లకు భరోసా కల్పించారు. నారాయణపేట రోడ్డు విస్తరణ, పార్కుల ఏర్పాటు, మెడికల్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రభుత్వ పరంగా సాధించిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, విజయ్‌సాగర్, సలీం (అడ్వకేట్), దేవరాజ్, జంగిటి వెంకటేష్, పోశాల్ సంతోష్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్



టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

Australia–China FTA (ChAFTA): ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆస్ట్రేలియాకు లాభం. చైనాకు స్థిర సరఫరా భరోసా.





# భారత్ తో ఆడకున్నా సెమీస్ కు పాక్!?

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇచ్చే ఈ టోర్నీలో పాకిస్థాన్ ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్ బహిష్కరించనుందని ప్రకటించింది. ఐసీసీ ఈ నిర్ణయాన్ని క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పేర్కొని, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవకాశాన్ని సూచించింది. గ్రూప్‌ఏలో పాకిస్థాన్ భారత్, నమీబియా, నెదర్లాండ్స్, అమెరికాతో పోటీ పడుతోంది. విశ్లేషకులు చెబుతున్నదేమిటంటే, తొలి మూడు మ్యాచ్‌ల్లో విజయాలు సాధిస్తే పాక్ జట్టు సూపర్ 8లోకి సులభంగా చేరుతుంది. సూపర్ 8లో గ్రూప్ వేర్వేరు ఉండటంతో భారత్‌తో తక్షణం తలపడకపోవడంతో సెమీస్ చేరే అవకాశం పెరుగుతుంది. అంతేకాక, పాక్ జట్టు ఇప్పటికే శ్రీలంక వేదికల్లోని పరిస్థితులను అర్థం చేసుకున్నది. నేరుగా 2 పాయింట్లు కోల్పోకపోయినా, భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ చేసినా.. పాకిస్థాన్ సునాయసంగా టోర్నీలో పురోగతి సాధించగలదు.



# భారత్ సాయాన్ని మరిచిన బంగ్లాదేశ్ నిర్ణయం

టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. భద్రతా కారణాలను చూపుతూ టోర్నమెంట్ నుంచి తప్పుకుంటామని బీసీబీ ప్రకటించడం విమర్శలకు గురవుతోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ క్రికెట్ ఎదుగుదలకు కీలకంగా తోడ్పడ్డ భారత క్రికెట్ నియంత్రణ మండలితో సంబంధాల విషయంలో ఈ నిర్ణయం అనూహ్యంగా మారింది. బంగ్లాదేశ్ క్రికెట్ ప్రారంభ దశలో నిలదొక్కుకునేందుకు భారత్ కీలక పాత్ర పోషించింది. అంతర్జాతీయ వేదికపై గుర్తింపు దక్కేలా 1998లో ఢాకాలో ఐసీసీ నాకౌట్ ట్రోఫీ నిర్వహణకు బీసీసీఐ మద్దతిచ్చింది. అదే ఏడాది భారత్‌లో జరిగిన ట్రై సిరీస్‌లో బంగ్లాదేశ్ జట్టును భాగస్వామిగా చేసి అంతర్జాతీయ అనుభవం కల్పించింది. 2000లో బంగ్లాదేశ్‌కు టెస్ట్ హోదా లభించినప్పుడు తొలి టెస్ట్ మ్యాచ్ ఆడిన జట్టు కూడా భారత్‌నే. బంగ్లాదేశ్‌కు ఐసీసీ పూర్తి సభ్యత్వం, టెస్ట్ హోదా సాధించడంలో బీసీసీఐ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్ దాల్మియా పాత్ర మరువలేనిది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాలు వ్యతిరేకించినా, అప్పటి ఐసీసీ అధ్యక్షుడిగా ఉన్న దాల్మియా ఆసియా దేశాలను ఏకం చేసి బంగ్లాదేశ్‌కు మద్దతు కూడగట్టారు. 2000 జూన్ 26న లండన్‌లో జరిగిన ఐసీసీ సమావేశంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి బంగ్లాదేశ్‌ను 10వ టెస్ట్ ప్లేయింగ్ దేశంగా గుర్తింపజేశారు. అందుకే ఆయనను బంగ్లాదేశ్ క్రికెట్‌లో కీలక నేతగా భావిస్తారు. క్రికెట్ పరంగా మాత్రమే కాదు, దేశంగా బంగ్లాదేశ్ అవతరించడంలోనూ భారత్ పాత్ర చారిత్రకమే. 1971లో పాకిస్థాన్ నుంచి విముక్తి కోసం సాగిన పోరాటంలో భారత్ ముక్తి వాహినికి మద్దతిచ్చింది. యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొని, పాక్ సైన్యాన్ని ఓడించి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి మార్గం సుగమం చేసింది. కోట్లాది శరణార్థులకు ఆశ్రయం కల్పించిన సందర్భాలు ఇప్పటికీ చరిత్రలో నిలిచిపోయాయి. ఇంతటి నేపథ్యం ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిణామాల్లో బంగ్లాదేశ్ వైఖరి విమర్శలకు దారితీస్తోంది. భారత్ అందించిన సాయాన్ని విస్మరించినట్లుగా వ్యవహరిస్తోందని క్రీడాభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. టీ20 ప్రపంచకప్ 2026 విషయంలో తీసుకున్న ఈ నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.






# హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్నాథ్ నియామకం

- **వివాదాల మధ్య మారిన పాలక మండలి సమీకరణాలు**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA)లో చోటుచేసుకున్న తాజా పరిణామాలు రాష్ట్ర క్రీడా వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. గెలాక్సీ క్రికెట్ క్లబ్‌కు చెందిన అమర్నాథ్‌ను హెచ్‌సీఏ కొత్త అధ్యక్షుడిగా నియమిస్తూ పాలక మండలిలో కీలక మార్పు జరిగింది.గతంలో జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అమర్నాథ్‌పై కేవలం ఒక్క ఓటు తేడాతో జగన్మోహన్ రావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే ఆ ఎన్నికల ప్రక్రియ అప్పట్లోనే వివాదాస్పదమైంది. అనంతరం శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌ను Cricket Administration పేరిట ఏర్పాటు చేసి అక్రమంగా ఓటింగ్ నిర్వహించారన్న ఆరోపణలు జగన్మోహన్ రావుపై వచ్చాయి. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా ఆయన అరెస్ట్ కావడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అక్రమ ఓటింగ్ ఆరోపణల నేపథ్యంలో జగన్మోహన్ రావును హెచ్‌సీఏ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. దీంతో ఖాళీ అయిన అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా అమర్నాథ్‌ను కొత్త అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ నిర్ణయంతో హెచ్‌సీఏ పాలనలో పారదర్శకత పెరుగుతుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇకపై అసోసియేషన్ కార్యకలాపాల్లో కొత్త అధ్యక్షుడు తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది.



# క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టం

- **హాకీ నుండి టీ20 వరల్డ్‌కప్ వరకు వేన్ మ్యాడ్‌సన్**

అంతర్జాతీయ క్రీడల్లో అరుదైన ఘట్టానికి వేదికగా 2026 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ నిలుస్తోంది. సౌతాఫ్రికా తరపున 2006 హాకీ వరల్డ్ కప్‌లో ఆడిన వేన్ మ్యాడ్‌సన్ 20 ఏళ్ల తర్వాత ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్నారు. ఈ ఘటన క్రీడా చరిత్రలో ఇదే మూడవ రకం: రెండు వేర్వేరు దేశాల తరపున వేర్వేరు క్రీడల్లో వరల్డ్‌కప్‌లో పాల్గొన్న అరుదైన ఘటన. మ్యాడ్‌సన్ ఇటలీ జట్టుకు 2023లో అంతర్జాతీయ క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటివరకు 7 టీ20ల్లో 205 పరుగులు చేసి, 34.16 సగటు, 132.26 స్ట్రైక్ రేట్ సాధించారు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు, అత్యధిక స్కోరు 61 నాటౌట్. ఇంగ్లిష్ కౌంటీ క్రికెట్‌లో 'డెర్బీషైర్' తరపున 5,500 పరుగులతో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా ఉన్నాయి. పీఎస్‌ఎల్‌లో మ్యాడ్‌సన్ రెండు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహించారు: 2019లో పెషావర్ జల్మీ, 2020లో ముల్తాన్ సుల్తాన్స్. 'ది హండ్రెడ్' లీగ్‌లో 2021-2024 వరకు మాంచెస్టర్ ఒరిజినల్, 2025లో లండన్ స్పిరిట్‌కు ఎంపికయ్యారు. బంగ్లాదేశ్ లీగ్‌లో రంగ్‌పూర్ రైడర్స్ తరపున కూడా ఆడారు. క్రికెట్‌లోకి రాకముందు, మ్యాడ్‌సన్ 39 అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లలో సౌతాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించారు. 2006 హాకీ వరల్డ్‌కప్, అదే ఏడాదిలో కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొని, 20 ఏళ్ల తర్వాత క్రికెట్ వరల్డ్‌కప్‌లో ఫిట్‌గా ఉన్నారంటే, ఇది చరిత్రలో ప్రత్యేక ఘట్టం. 2026 టీ20 వరల్డ్‌కప్‌లో ఇటలీ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, నేపాల్, స్కాట్లాండ్‌లతో యుద్ధం చేస్తుంది. ఫిబ్రవరి 9న స్కాట్లాండ్‌తో ప్రారంభమయ్యే మ్యాచ్‌తో వారి వరల్డ్‌కప్ ప్రయాణం మొదలవుతుంది. తరువాతి మ్యాచ్‌లు: ఫిబ్రవరి 12న నేపాల్, ఫిబ్రవరి 16న ఇంగ్లాండ్, ఫిబ్రవరి 19న వెస్టిండీస్‌తో జరగనున్నాయి.

# కమిన్స్ ఫిట్‌నెస్‌పై దృష్టి..

- **సన్ రైజర్స్ వ్యూహాల్లో మార్పులా?**

ఐపీఎల్ 2026కు ముందు సన్ రైజర్స్ జట్టులో కీలక చర్చ ప్యాట్ కమిన్స్ ఫిట్‌నెస్ చుట్టూనే కొనసాగుతోంది. కమిన్స్ పూర్తిస్థాయిలో ఫిట్ కాకపోతే ఎస్ ఆర్ హెచ్ వ్యూహాల్లో మార్పులు చేయాల్సిన పరిస్థితి రావొచ్చని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో అతని అనుభవం, మైదానంలో చూపించే నాయకత్వం జట్టుకు ఎంతో కీలకమని కోచ్‌లు అభిప్రాయపడుతున్నారు. కమిన్స్ అందుబాటులో లేకపోతే తాత్కాలిక కెప్టెన్ ఎంపికతో పాటు బౌలింగ్ యూనిట్ బాధ్యతలపై సన్ రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆలోచనలు చేస్తోందని సమాచారం. అయితే ఇవన్నీ ముందస్తు జాగ్రత్తలుగానే పేర్కొంటున్నారు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే కమిన్స్ కోలుకుని జట్టుతో చేరతాడనే ఆశాభావం కొనసాగుతోంది. గత సీజన్‌లో కమిన్స్ నాయకత్వంలో సన్ రైజర్స్ సమతుల్యమైన ప్రదర్శన చేసింది. కీలక మ్యాచ్‌ల్లో అతని నిర్ణయాలు జట్టుకు కలిసి వచ్చాయి. ఈసారి కూడా ఎస్ ఆర్ హెచ్‌కు అతని సేవలు అవసరమని అభిమానులు భావిస్తున్నారు. కమిన్స్ త్వరగా కోలుకోవాలంటూ సోషల్ మీడియాలో అభిమానుల సందేశాలు వెల్లువెత్తుతున్నాయి.




# టీ20 ప్రపంచకప్ 2026 కోసం హైదరాబాద్ స్టార్ రిటర్న్

టీమిండియా యువ బ్యాటర్ *తిలక్ వర్మ* ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు ఫిట్‌నెస్, ఫామ్ చూపించాడు. వృషణాల శస్త్ర చికిత్స తర్వాత కోలుకున్న తిలక్, భారత్‌ఏ జట్టుతో డీవై పాటిల్ స్టేడియంలో సోమవారం వామప్ మ్యాచ్‌లో 38 పరుగుల ప్రత్యేక ప్రదర్శన ఇచ్చాడు. 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 158.33 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్ల ప్రయత్నంలో ఒకసారి క్యాచ్ అవుతూ వెనుదిరిగాడు.

**జగదీష్ సెంచరీ, కెప్టెన్ హాఫ్ సెంచరీ**

భారత్‌ఏ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. నారాయణ్ జగదీషన్ 55 బంతుల్లో 104 పరుగులతో సెంచరీ సాధించాడు. కెప్టెన్ *ఆయుష్ బదోని* 26 బంతుల్లో 60* రన్నులతో మద్దతు ఇచ్చాడు. అమెరికా జట్టు 19.4 ఓవర్లలో 200 పరుగులకే ఆలౌటైంది. రవి బిష్ణోయ్ 3 వికెట్లతో, నమన్ ధీర్ 2 వికెట్లతో, ఖలీల్ అహ్మద్ 2 వికెట్లతో బౌలింగ్‌లో ప్రాధాన్యత సాధించారు.

**సంజూ శాంసన్ బెంచ్‌లో**

తిలక్ వర్మ రిటర్న్‌తో భారత తుది జట్టులో సంజూ శాంసన్ అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. బుధవారం రాత్రి 7.30 గంటలకు ముంబై డివై పాటిల్ స్టేడియంలో భారత్‌సౌతాఫ్రికా వామప్ మ్యాచ్‌లో తిలక్ బరిలోకి దిగే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ ప్రదర్శనతో కూడా సంజూ బెంచ్‌లో పరిమితమయ్యాడు. తిలక్ వర్మ పూర్తి ఫిట్‌నెస్‌లో, ఫార్మ్‌లో ఉందని అభిమానులు ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

యూరోపియన్ యూనియన్ – కెనడా (CETA): టారిఫ్‌ల తగ్గింపుతో పాటు పెట్టుబడులకు రక్షణ. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల మధ్య మోడల్ ఒప్పందం.





## దురంధర్ పాకిస్తానీలకూ నచ్చాడు

భారత్-పాకిస్థాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో పాటు, గత ఏడాది పహల్గాం ఘటన తర్వాత పరిస్థితి మరింత కఠినమైంది. దీని ప్రభావం సినిమా రంగంపైనా పడింది. ఒకప్పుడు రెండు దేశాల మధ్య సాగిన సినీ పరస్పర సంబంధాలు ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయాయి. పాకిస్థాన్ నటీనటులు భారత చిత్రాల్లో కనిపించడం లేదు, అలాగే భారత సినిమాలు అక్కడ థియేటర్లలో విడుదల కావడం కూడా ఆగిపోయింది. అయినా హిందీ సినిమాలపై ఆసక్తి తగ్గలేదు. ముఖ్యంగా పాకిస్థాన్ నేపథ్యంతో తెరకెక్కిన 'దురంధర్' విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ అధికారికంగా విడుదల కాకపోయినా, పైరసీ మార్గంలో ఈ సినిమాను పెద్ద సంఖ్యలో వీక్షించినట్లు సమాచారం. అంచనాల ప్రకారం పాకిస్థాన్‌లో ఈ సినిమా పైరసీ డౌన్‌లోడ్లు 20 లక్షలు దాటినట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా 'దురంధర్' పాకిస్థాన్‌లో నంబర్ వన్ ట్రెండింగ్ మూవీగా కొనసాగుతోంది. ఆసక్తికరంగా, అక్కడ నెట్‌ఫ్లిక్స్ టాప్ లిస్ట్‌లో రెండో స్థానంలోనూ బాలీవుడ్ సినిమానే ఉంది. ధనుష్, కృతి సనన్ నటించిన 'తేరే ఇష్క్ మే' కూడా ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ గణాంకాలపై స్పందిస్తున్న భారత నెటిజన్లు, బాలీవుడ్ సినిమాలకున్న క్రేజ్ సరిహద్దులు దాటుతోందంటూ సోషల్ మీడియాలో చర్చిస్తున్నారు.





## రోడ్డుపై దొరికిన బంగారం.. నిజాయతీకి రజనీకాంత్ గౌరవం

చెన్నై మహానగర పాలకసంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ నిజాయతీకి అరుదైన గౌరవం దక్కింది. రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి ఆమె తన నిజాయతీని చాటుకున్నారు. ఈ ఘటన అప్పట్లో విస్తృతంగా చర్చకు దారితీసింది. పద్మ చేసిన పనిని మెచ్చుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ ఆమెను తన నివాసానికి ఆహ్వానించారు. అక్కడ ఆమెతో సన్నిహితంగా మాట్లాడిన ఆయన, గుర్తుగా బంగారు గొలుసును కానుకగా అందించారు. సాధారణ కార్మికురాలి నిజాయతీని గౌరవించిన ఈ చర్యకు ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో పద్మకు భారత తపాలా శాఖ ప్రత్యేక గౌరవం కల్పించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని అందించారు. ప్రభుత్వం తరఫున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో ఇచ్చిన సంగతి తెలిసిందే.

## పీఆర్ వార్.. రకుల్ సంచలన వ్యాఖ్యలు

బాలీవుడ్‌లో తాజాగా సాగుతున్న పీఆర్ వార్స్‌పై రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించింది. ఒకరిని దెబ్బతీయడానికి డబ్బులు ఖర్చు చేసి మరీ నెగిటివ్ ప్రచారం చేయిస్తున్న సంస్కృతి ప్రమాదకరంగా మారిందని వ్యాఖ్యానించింది. అసలు గుర్తింపు కష్టంతోనే వస్తుందనీ, పీఆర్ వ్యవస్థలు కొంతవరకే ఉపయోగపడతాయని స్పష్టం చేసింది.ఇతరులపై విషం చిమ్మే ఇలాంటి చర్యలు చేసే వారు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోక తప్పదని రకుల్ హెచ్చరించింది. తాను ఎవరి సహాయం లేకుండా స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నానని, చీప్ పీఆర్ పద్ధతులు తనకు అవసరం లేదని తేల్చిచెప్పింది.ఇక ఫోటోగ్రాఫర్ల వ్యవహారంపైనా ఆమె అసహనం వ్యక్తం చేసింది. తాను ఏ దుస్తులు వేసుకోవాలన్నది తన వ్యక్తిగత ఇష్టమని, ప్రతి విషయాన్ని అతిగా విశ్లేషించడం సరికాదని పేర్కొంది. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీస్తున్నాయి.



## అలయా ఎఫ్ గ్లామర్ షో

బాలీవుడ్ యువ నటి అలయా ఎఫ్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. ఇటీవల ఆమె షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫొటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మారూన్ కలర్ స్ట్రాప్‌లెస్ కార్సెట్ గౌన్‌లో అలయా స్టైలిష్ లుక్‌లో కనిపించింది. వేవీ హెయిర్, బోల్డ్ మేకప్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. వాలెంటైన్స్ సందర్భంగా చేసిన ఈ ఫొటోషూట్ అభిమానుల నుంచి మంచి స్పందన పొందుతోంది.



## ప్యారడైజ్ బడ్జెట్ మించిపోయిందా?

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'పై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. 'దసరా' తర్వాత ఈ కాంబో నుంచి వస్తున్న చిత్రంగా ఇప్పటికే చర్చలో ఉన్న ఈ మూవీ బడ్జెట్ విషయంలోనూ రికార్డు స్థాయికి చేరినట్లు సమాచారం. తొలుత రూ.150 కోట్లుగా భావించిన వ్యయం, మేకింగ్ స్కేల్ పెరగడంతో రూ.200 కోట్లకు పైగా వెళ్లినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్. ఇది నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. షూటింగ్ దశలోనే ఈ సినిమాకు ఓటీటీ మార్కెట్‌లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సుమారు రూ.75 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. 1990ల కాలం నాటి సికింద్రాబాద్ స్లమ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాని మాస్ పాత్రలో కనిపించనున్నారు. మోహన్ బాబు, రాఘవ జుయల్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 26న విడుదల లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ వాయిదా పడే అవకాశముందని ప్రచారం సాగుతోంది.

## సరిహద్దులు దాటి ప్రతీకారం..

- 'ధురంధర్ 2' టీజర్‌తో హై వోల్టేజ్ హింట్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' గత ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. వాణిజ్యపరంగా రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు కొనసాగింపుగా సీక్వెల్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'ధురంధర్: ది రివెంజ్' పేరుతో రూపొందిన రెండో భాగాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. మొదటి భాగం కేవలం హిందీలోనే విడుదల కాగా, ఈసారి హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ప్రేక్షకులను పలకరించనుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'ధురంధర్ 2' టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌లో రణ్‌వీర్ సింగ్ చెప్పిన "ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది" అనే డైలాగ్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది.



## నిరాశ నుంచి కొత్త దారి దాకా

- **నాలుగేళ్ల విరామం వెనుక కారణాలు చెప్పిన మాధవన్**

తన కెరీర్‌లో ఒక దశలో చేస్తున్న పనిపై అసంతృప్తి ఏర్పడటంతోనే నాలుగేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్నానని నటుడు మాధవన్ తెలిపారు. 2011 నుంచి 2015 వరకూ ఇండస్ట్రీకి విరామం ఇచ్చిన ఆయన, 2016లో 'సాలా ఖదూస్'తో మళ్లీ నటన ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ విరామం వెనుక కారణాలను వివరించారు. తనకు విశ్రాంతి అవసరమని అనిపించిందని, అందుకే సినిమాలతో పాటు ప్రకటనలకు కూడా పూర్తిగా దూరంగా ఉన్నానని చెప్పారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా పర్యటిస్తూ సాధారణ ప్రజలతో మమేకమయ్యానని వెల్లడించారు. చెన్నై పరిసరాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలు తిరిగిన ఆయన, రిక్షా డ్రైవర్లు సహా పలువురితో మాట్లాడి వారి జీవన పరిస్థితులు, సమస్యలను తెలుసుకున్నానని పేర్కొన్నారు. ఆ ప్రయాణం తన జీవిత దృక్పథాన్నే మార్చిందని అన్నారు. విరామం అనంతరం చేయాలనుకున్న పాత్రలపై స్పష్టత వచ్చిందని మాధవన్ తెలిపారు. తిరిగి వచ్చిన తర్వాత పరిశ్రమలో కొందరిలో ముందుచూపు లోపించిందని గ్రహించి, కొత్త ఆలోచనలున్న దర్శకులను వెతకడం ప్రారంభించినట్లు చెప్పారు. ఇటీవల 'ధురంధర్'లో నటించి మెప్పించిన మాధవన్, ఆ సినిమా షూటింగ్ అనుభవాలను కూడా పంచుకున్నారు. షూటింగ్ సమయంలో తాను సెట్‌కు వెళ్లిన ప్రతిసారి వర్షం కురిసేదని, అందుకే యూనిట్ సభ్యులు తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని చెప్పారు. ఎండ తక్కువగా ఉన్న వాతావరణంలో తీసిన సన్నివేశాలే సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని వివరించారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com